ఫిబ్రవరిలో వస్తున్న భైరవకోన



సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందుతున్న ఫాంటసీ అడ్వెంచర్ 'ఊరుపేరు భైరవకోన'. వీఐ ఆనంద్ దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. అనిల్ సుంకర సమర్పకులు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నట్లు బుధవారం చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో సందీప్ కిషన్ మంత్రదండం పట్టుకొని గంభీరంగా కనిపించడం సినిమాపై ఆసక్తిని పెంచింది. అతీంద్రియ శక్తులకు సంబంధించిన అంశాల చుట్టూ అల్లుకున్న కథ ఇదని మేకర్స్ తెలిపారు. వర్ష బొల్లమ్మ, కావ్యా థాపర్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: ఛోటా కె. ప్రసాద్.

దేవకీ నందన వాసుదేవ



'ఈ కథకి 'దేవకీ నందన వాసుదేవ' సరైన టైటిల్. ఈ కథకోసం రెండేళ్లు వర్క్ చేశాను. నాకంటే బాగా తీయగలడనే నమ్మకంతో అర్జున్‌కి ఈ కథ ఇచ్చాను. స్టార్ రైటర్ సాయిమాధవ్ బుర్రాగారి మాటలు ఈ సినిమాకు పెద్ద ఎస్సెట్. అద్భుతమైన సంభాషణలు అందించారాయన. భీమ్స్ మంచి పాటలు ఇచ్చారు. పాత్రలకు తగ్గట్టు ఆర్టిస్టులు సెట్ అయ్యారు. ఇంత మాస్ పాత్రను అశోక్ ఎలా చేస్తాడా అనుకున్నాను. రషస్ చూశాక షాక్ అయ్యాను. చాలా సర్‌ప్రైజ్ ఇచ్చాడు' అని ప్రశాంత్ వర్మ అన్నారు. ఆయన కథతో అశోక్ గల్లా కథానాయకుడిగా అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రానికి 'దేవకీ నందన వాసుదేవ' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. వారణాసి మానస కథానాయిక. సోమినేని బాలకృష్ణ నిర్మాత. ఈ చిత్రం టీజర్‌ని బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌వర్మ మాట్లాడారు. 'ప్రశాంత్‌వర్మ అద్భుతమైన కథ, సాయిమాధవ్‌గారి సంభాషణలు, అర్జున్ దర్శకత్వ ప్రతిభ ఇవన్నీ ఈ సినిమాను నెక్ట్స్ లెవల్లో నిలబెట్టాయి. ఆ ప్రభావం రేపు థియేటర్లలో చూస్తారు.' అని అశోక్ గల్లా నమ్మకంగా చెప్పారు. బాలకృష్ణ రాజీ పడకుండా సినిమాను నిర్మిస్తున్నారని, సాయిమాధవ్ మాటలు, భీమ్స్ పాటలు అలరిస్తాయని దర్శకుడు చెప్పారు. కృష్ణగారి కుటుంబం నుంచి వచ్చిన అశోక్ తప్పకుండా సూపర్‌స్టార్ అవుతాడని సాయిమాధవ్ బుర్రా నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందం మాట్లాడారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/CIll4Mq లో చదవండి.

సంక్రాంతికి మరో సూపర్‌హిట్ ఖాయం



'తెలుగువారికి సంక్రాంతి అంటే సినిమా పండుగ. ప్రేక్షకులు గతంలో నా సంక్రాంతి సినిమాలను గొప్ప హిట్ చేశారు. ఇప్పుడు 'నా సామిరంగ చిత్రాన్ని కూడా అదే రీతిలో ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఈ సారి పండుగకు కిష్టయ్య వస్తున్నాడు. 'నా సామిరంగ అంటూ బాక్సాఫీసును కొట్టబోతున్నాడు' అని నాగార్జున అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'నా సామిరంగ' చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. విజయ్ బిన్నీ దర్శకుడు. చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'ఈ సంక్రాంతికి నాలుగు సినిమాలు వస్తున్నాయి. అన్నింటినీ ఆదరించాలని ప్రేక్షకులను కోరుతున్నాను. నాన్నగారి ఆజ్ఞగా భావించి 'నా సామిరంగ' చిత్రం చేశాను. కీరవాణి అద్భుతమైన పాటలు ఇచ్చారు. మూడు నెలల్లో ఈ సినిమాను పూర్తి చేయడం ఒక రికార్డు' అని తెలిపారు. అల్లరి నరేశ్ మాట్లాడుతూ 'చిన్నతనం నుంచి నేను నాగార్జున గారికి అభిమానిని. ఈలలు వేస్తూ థియేటర్లలో ఆయన సినిమాలు చూశాను. కీరవాణి, చంద్రబోస్ గారు మా టీంకు అండగా నిలిచారు' అని తెలిపారు. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'నాగార్జున గారితో కలసి నటించడం మరచిపోలేని అనుభవం. అక్కినేని అభిమానులందరూ ఈ సారి థియేటర్లలో పండుగ చేసుకోవడం ఖాయం' అన్నారు. విజయ్ బిన్నీ మాట్లాడుతూ 'చాలా తక్కువ టైంలో మంచి క్వాలిటీతో సినిమాను పూర్తి చేశాం. నా సాంగ్స్ చూసి దర్శకుడిగా అవకాశం ఇచ్చిన నాగార్జున గారికి రుణపడి ఉంటాను. యూనిట్‌లో ప్రతి ఒక్కరి సహకారంతో సినిమాను అనుకున్న విధంగా తెరకెక్కించగలిగాను' అన్నారు. కీరవాణి మాట్లాడుతూ 'కొత్త ప్రతిభను గుర్తించి అవకాశాలు ఇవ్వడంలో నాగార్జున ముందుంటారు. 'నా సామిరంగతో విజయ్ దర్శకుడిగా హిట్ అందుకోవాలి' అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి నాగార్జున గారు నన్ను ఆహ్వానించడమే గొప్ప గౌరవం అని చంద్రబోస్ తెలిపారు. నాగార్జున గారి లాంటి స్టార్‌తో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను అని ఆశికా రంగనాథ్ చెప్పారు.

అంజమ్మ అందరికీ నచ్చుతుంది



'హీరోయిన్ అనిపించుకోవడం కంటే మంచి నటి అనిపించుకోవడమే నాకిష్టం. హీరోయిన్ అని ట్యాగ్ తగిలిస్తే ఆనందపడిపోయే టైప్ కాదు నేను' అంటూ చెప్పుకొచ్చారు వరలక్ష్మి శరత్‌కుమార్. తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హను-మాన్'. కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా అందులో కీలకపాత్ర పోషించిన వరలక్ష్మి శరత్‌కుమార్ విలేకరులతో ప్రత్యేకంగా ముచ్చటించారు.

- ప్రశాంత్‌వర్మ ఈ కథ చెప్పినప్పుడు కచ్చితంగా చేయాల్సిన కథ అనిపించింది. ఈ సినిమాలో నా పాత్రపేరు అంజమ్మ. నేనూ, తేజా అక్కాతమ్ముళ్లం. మాపై తీసిన సరదా సన్నివేశాలు చక్కటి వినోదాన్ని పంచుతాయి. ఇది సూపర్‌హీరో కాన్సెప్ట్‌లో తెరకెక్కిన సినిమా. నేను కూడా ఒక యాక్షన్ సీక్వెన్స్ చేశాను. ఒక మాస్ హీరోకి ఉన్నంత ఎలివేషన్ వుండే యాక్షన్ సీక్వెన్స్ అది. ప్రశాంత్‌వర్మ ఎంత అద్భుతంగా ఈ కథ చెప్పాడో, అంత అద్భుతంగా తీశాడు. చిన్న సినిమాగా మొదలైన ఈసినిమా.. ఇంతింతై, వటుడింతై అన్నట్టు ఇంత పెద్ద స్కేల్‌లో గ్రాండ్‌గా రావడం చాలా ఆనందంగా ఉంది. ప్రేక్షకుల్లో కూడా పాజిటివ్ బజ్ ఉంది.
- నిర్మాత నిరంజన్‌రెడ్డికి హ్యాట్సాఫ్ చెప్పాలి. 'హను-మాన్' అద్భుతంగా నిర్మించారు. దర్శకుడి విజన్‌ని అర్థం చేసుకునే నిర్మాత దొరకడం టీమ్ అదృష్టం. సినిమా ఒప్పుకున్న రోజున చిన్న సినిమా అనుకున్నాను. తొలిరోజు సెట్‌లోకి అడుగుపెట్టగానే ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్స్ కనిపించాయి. అప్పుడర్థమైంది ఇది చిన్న సినిమా కాదు అని. ఏ విషయంలోనూ నిర్మాత రాజీ పడలేదు.

దిక్సూచి DIKSUCHI



పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు 'భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం', 'రాజ్యాంగ పరిషత్' అంశాలను చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. తొలుత రాజ్యాంగంలోని అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఆ తరవాత భారత రాజ్యాంగ చారిత్రక నేపథ్యం, రాజ్యాంగ పరిషత్ అనే అంశాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

భారత రాజ్యాంగం - ముఖ్య చట్టాలు

పిట్ ఇండియా చట్టం-1784: ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీ కార్యకలాపాలను రెండు రకాలుగా విభజించారు.
1) బోర్డ్ ఆఫ్ కంట్రోల్: పరిపాలనా వ్యవహారాలను పరివేక్షిస్తుంది. దీనిలో ఆరుగురు సభ్యులు ఉంటారు.
2) కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్: వీరు వ్యాపార, వాణిజ్య అవసరాలను నియంత్రిస్తారు.
బోర్డ్ ఆఫ్ కంట్రోల్, కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ వ్యవస్థల ఏర్పాటు దేశంలో పార్లమెంటేతర నియంత్రణనే కాక ద్వంద్వ పాలనకు కూడా పునాది వేసింది.

1773 రెగ్యులేటింగ్ చట్టం ద్వారా గవర్నర్ జనరల్‌కు సలహా ఇవ్వడానికి కౌన్సిల్ ఆఫ్ ఫోర్ అనే నలుగురు సభ్యుల కార్యనిర్వాహక మండలి ఉండేది. పిట్స్ ఇండియా చట్టం ద్వారా సభ్యులను ముగ్గురికి తగ్గించారు. ఈ చట్టం ద్వారానే దేశంలో బ్రిటిష్ పాలిత ప్రాంతాలు అనే పదం బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. పిట్స్ ఇండియా చట్టం అనంతరం 1793, 1813, 1833, 1853 చార్టర్ చట్టాలు చేశారు.

చార్టర్ చట్టం-1793: 1773 రెగ్యులేటింగ్ చట్టం చేసిన తరవాత బ్రిటిష్ పార్లమెంటు ప్రతి 20 సంవత్సరాలకు ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో కొనసాగడానికి సంబంధించిన అనుమతిని పునఃపరిశీలించాలని భావించింది. కానీ రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాల దృష్ట్యా 1784లో పిట్స్ ఇండియా చట్టాన్ని చేశారు. అనంతరం(1773 నుంచి 1853 వరకు) బ్రిటిష్ పార్లమెంటు ఈస్టిండియా కంపెనీని క్రమబద్ధీకరించడం, నియంత్రించడానికి ప్రతి 20 సంవత్సరాలకు ఒక చట్టాన్ని చేసింది.

చట్టంలోని ముఖ్యాంశాలు

1) ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీకి భారతదేశంలో 20 సంవత్సరాలు వ్యాపారం చేసుకునే అవకాశాన్ని పొడిగించారు.
2) కంపెనీ వ్యవహారాల వార్షిక నివేదికను బ్రిటన్ పార్లమెంటుకు సమర్పించాలి.
3) గవర్నర్ జనరల్‌కు కౌన్సిల్ తీర్మానాలపై వీటో అధికారాన్ని కల్పించారు.
4) కంపెనీకి వచ్చే లాభాల నుంచే ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించాలి.
5) మున్సిపాలిటీలకు చట్టబద్ధత కల్పించారు.
6) భారతీయులకు సంబంధించిన వారి ఆస్తులు, వివాహం, వారసత్వం, మతం మొదలైన అంశాల్లో బ్రిటిష్ పార్లమెంటు చేసే చట్టాలతోపాటు గవర్నర్ జనరల్ రూపొందించిన నియమాలకు సమానమైన విలువ ఉంటుంది.

చార్టర్ చట్టం-1813: ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీకి 20 సంవత్సరాల వ్యాపార అనుమతి ఇచ్చారు. ఈస్టిండియా కంపెనీలో భారతీయులకు కూడా ఉద్యోగావకాశాలు కల్పించారు. భారతదేశ వ్యాపారంపై ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్యం (చైనాతో తేయాకు వ్యాపారం మినహా)పోయింది. ప్రతి బ్రిటిష్ పౌరునికి ఇండియాలో వ్యాపార స్వేచ్ఛ కల్పించారు. క్రైస్తవ మిషనరీలు ఇండియాకు వచ్చాయి. స్థానిక సంస్థలకు పన్నులు విధించే అధికారాన్ని కల్పించారు. ఇండియాలో విద్యా వ్యాప్తికి ఒక లక్ష రూపాయలు కేటాయించారు.

చార్టర్ చట్టం-1833: ఈస్టిండియా కంపెనీకి మరో 20 సంవత్సరాలు వ్యాపార అనుమతి ఇచ్చారు. బెంగాల్ గవర్నర్ జనరల్ పదవిని, భారత గవర్నర్ జనరల్‌గా పదోన్నతులు కల్పించారు. మొదటి భారత గవర్నర్ జనరల్- విలియం బెంటింక్. సివిల్ సర్వీస్ పరీక్షల్లో భారతీయులకు ప్రవేశం కల్పించారు. కానీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ వ్యతిరేకత వల్ల దీని అమలు ఆగిపోయింది. గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలి సభ్యుల సంఖ్యను నాలుగుకి పెంచారు. గవర్నర్ కౌన్సిల్‌లో ఒక న్యాయ నిపుణుడైన సభ్యుడిని ఏర్పాటు చేశారు. న్యాయ సభ్యునిగా నియమించిన మొదటి వ్యక్తి - లార్డ్ మెకాలే. ఈయనే భారత 'లా కమిషన్ ఛైర్మన్'గా నియమితులయ్యారు.

చార్టర్ చట్టం-1853: బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీకి 20 సంవత్సరాల వ్యాపార అనుమతిని పొడిగించలేదు. ఇండియాలో సివిల్ సర్వీసులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. శాసన నిర్మాణంలో భారతీయులకు అవకాశం కల్పించారు. కానీ తుది నిర్ణయం గవర్నర్‌దే. గవర్నర్ జనరల్ విధులను రెండుగా విభజించారు. అవి- 1) శాసన నిర్మాణ విధులు 2) కార్యనిర్వాహక విధులు. అలాగే లా కమిషన్ సిఫార్సులను ప్రకటించారు. అవి- 1) 1859- సివిల్ వివాదాల చట్టం అమలులోకి వచ్చింది(సీపీసీ) 2) 1860- భారత పీనల్‌కోడ్ అమలులోకి వచ్చింది(ఐపీసీ) 3) 1861- క్రిమినల్ చట్టం అమలులోకి వచ్చింది(సీఆర్‌పీసీ). కానీ కంపెనీ హక్కులను పొడిగించే అంశాన్ని ప్రస్తావించలేదు.


భారత రాజ్యాంగచట్టం-1858: ఈ చట్టం ద్వారా దేశంలో ఈస్టిండియా కంపెనీ పాలన అంతమై నేరుగా బ్రిటిష్ పాలన ప్రారంభమైంది. ఈ చట్టంలో బ్రిటిష్ రాణి భారతదేశానికి కూడా మహారాణియే అని ప్రకటించడం ద్వారా దేశంలోని సంస్థానాలు కూడా బ్రిటిష్ ప్రభుత్వం అధికారాన్ని ఒప్పుకోవాల్సి వచ్చింది. భారత గవర్నర్ జనరల్‌ను వైస్రాయ్‌గా మార్చారు. మొదటి వైస్రాయ్ 'లార్డ్ కానింగ్'(చివరి భారత గవర్నర్ జనరల్). 1857 సిపాయిల తిరుగుబాటు కాలంలో గవర్నర్ జనరల్- కానింగ్. బ్రిటన్ మహారాణి భారతదేశానికి కూడా మహారాణియే. బ్రిటిష్ ప్రభుత్వంలో భారత వ్యవహారాల మంత్రిత్వశాఖ ఏర్పాటు జరిగింది. మొదటి భారత వ్యవహారాల మంత్రి, భారత కార్యదర్శి - రిచర్డ్ స్టాన్లీ. భారతదేశం తొలిసారిగా బ్రిటిష్ ప్రత్యక్ష పాలనలోకి వెళ్లింది. 1858 నవంబరు 1న మొదటి విక్టోరియా రాణి ఒక చారిత్రాత్మక ప్రకటన చేసింది. 'భారత ప్రజల అభ్యుదయమే మాకు బలం, వారి కృతజ్ఞతే మాకు పారితోషికం, సర్వశక్తి సంపన్నుడైన భగవంతుడు మాకు, మా ఉద్యోగులకు, భారత ప్రజలకు సేవ చేయడానికి శక్తి సామర్థ్యాలు ఇచ్చు గాక'. భారత వ్యవహారాల మంత్రిత్వపు శాఖ భారత కౌన్సిల్ సభ్యుల సలహా మేరకు పనిచేస్తుంది. ఈ చట్టం ప్రకారం భారతదేశ పాలనా వ్యవస్థ మౌలిక స్థాయిలో ఏర్పడింది.



వి.చైతన్యదేవ్,
పోటీ పరీక్షల నిపుణులు

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/WeVeLPnలో చదవండి.

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పీజీ ప్రోగ్రామ్‌లు



ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీకేజీపీ)- 'మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (ఎంహెచ్‌ఆర్‌ఎం)', 'మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)', 'మాస్టర్ ఇన్ మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎంఎంఎస్‌టీ)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇవి ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. ● **వెబ్‌సైట్:** iitkgp.ac.in

ఎంహెచ్‌ఆర్‌ఎం

సంస్థ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తోంది. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా వింటర్, సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 25

ఎంబీఏ

సంస్థ ఆధ్వర్యంలోని వినోద్ గుప్త స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లకుగాను మొత్తం 91 క్రెడిట్స్ నిర్దేశించారు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 5

ఎంఎంఎస్‌టీ

ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. మెడికల్ సైన్సెస్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వినియోగానికి సంబంధించి శిక్షణ ఇస్తారు. సైన్స్-ఇంజనీరింగ్ స్కిల్స్‌పై అవగాహన కల్పిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ సబ్జెక్టులు, ఎలక్టివ్ సబ్జెక్టులు, సెమినార్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. వీటికి సంబంధించిన వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.


- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31

ఐఐటీబీ - మోనాష్‌లో పీహెచ్‌డీ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే, మోనాష్ యూనివర్సిటీ(ఆస్ట్రేలియా) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'ఐఐటీబీ-మోనాష్ రీసెర్చ్ అకాడమీ' పీహెచ్‌డీ 2024 జూన్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. గేట్ వ్యాలిడ్ స్కోర్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడు నుంచి నాలుగేళ్ల వరకు ఉంటుంది.

రీసెర్చ్ థీమ్స్

- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటేషనల్ మోడలింగ్
- క్లీన్ ఎనర్జీ
- హెల్త్ సైన్సెస్
- స్మార్ట్ మెటీరియల్స్
- సస్టయినబుల్ సొసైటీస్ అండ్ మేనేజ్‌మెంట్
- సర్క్యులర్ ఎకానమీ
- ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీరింగ్
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** iitbmonash.org







ఇసుక ఇష్టారాజ్యం

- అడ్డేలేకుండా తవ్వకం.. అమ్మకం
- ప్రభుత్వ ధరకు రెట్టింపు వసూలు
- ఒక బిల్లుతో కావాల్సినన్ని ట్రిప్పులు
- బుసక రీచ్‌ల్లోనూ ఇసుక తవ్వకాలు
- అధికారిక రీచ్‌లు మూడే.. అనధికారం లెక్కేలేదు
- మామూళ్ల మత్తులో మునిగి పట్టించుకోని అధికారులు

గుంటూరులో 5 టన్నులు రూ.5,800


ఇసుక ధరలను సప్లయర్లు మళ్లీ పెంచేశారు. ఇటీవల ఇసుక ధర తగ్గించినట్లే తగ్గించి ఒక్కసారిగా రెట్టింపు చేయడంపై భవన నిర్మాణదారులు, సొంత ఇల్లు నిర్మించుకుంటున్న సామాన్యులు తీవ్ర ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు మున్నంగి, వల్లభాపురం రీచ్‌లను కేటాయించారు. అక్కడ టన్ను రూ.475గా ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా పాయింట్ల నుంచి గుంటూరు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ దృష్ట్యా టన్నుకు రూ.196 రవాణా చార్జీలను నిర్ణయించారు. మొత్తంగా టన్ను ఇసుక ధర రూ.671 దాటడానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే 5 టన్నుల ట్రాక్టర్ ఇసుక రూ.3,355కి సరఫరా చేయాలి. అయితే సప్లయర్లు ఏకంగా రూ.5,800 డిమాండ్ చేస్తున్నారు. అదే 11 టన్నుల 6 టైర్ల లారీకి రూ.9,500 వసూలు చేస్తున్నారు. 10 టైర్ల లారీకి 27 నుంచి 28 టన్నులు వస్తుందని, టన్ను రూ.800 చొప్పున లెక్కించి రూ.22 వేలు చెల్లించాల్సిందిగా కోరుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో పోల్చితే ట్రాక్టరు, 6 టైర్ల లారీకి దాదాపుగా రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. 10 టైర్ల లారీ విషయానికి వస్తే 35 టన్నులకు పైగా లోడింగ్ చేసి తీసుకొచ్చి అందులో ఆరు, ఏడు టన్నుల ఇసుకని ట్రాక్టర్లలో అన్‌లోడింగ్ చేసి మిగతా 27 టన్నులు రూ.800 చొప్పున టన్నుకు రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు.

ఇసుక వాహనాలు సీజ్ చేయొద్దని అనధికార ఆదేశాలు

జిల్లా వ్యాప్తంగా ఇసుక తరలించే ట్రాక్టర్లు, లారీలను ఎక్కడా సీజ్ చేయొద్దని ప్రభుత్వ పెద్దల నుంచి మైనింగ్, పోలీసు, విజిలెన్స్ తదితర శాఖలకు ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. అలానే రవాణా శాఖకు కూడా ఈ విషయంలో నిర్దిష్టమైన ఆదేశాలు ఉండటంతో ఓవర్ లోడింగ్ జరుగుతున్నా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎలాంటి కేసులు నమోదు చేయడం లేదు.

ఇసుక.. అధికార పార్టీ నేతలకు కాసులు కురిపిస్తోంది. ఇష్టారీతిన తవ్వుతూ.. తరలిస్తూ కాసులు పోగేసుకుంటున్నారు. అధికారిక రీచ్‌లతో పాటు అనధికార రీచ్‌ల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారు. నిబంధనలు పట్టించుకోవడంలేదు. కళ్లెదుటే ఇసుక దోపిడీ జరుగుతున్నా మామూళ్ల మత్తులో అధికారులు మునిగిపోయారు. బిల్లులతో పని లేకుండా ఒకే బిల్లుపై పలుమార్లు ఇసుక తరలిపోతున్నా.. పట్టించుకునేవారు లేరు. ప్రభుత్వం వారంవారం పత్రికల్లో ధరను నిర్ణయిస్తూ ప్రకటిస్తున్నా.. వసూలు చేసే ధరకు పొంతనే ఉండటంలేదు. ప్రకాశం బ్యారేజి దిగువన అడ్డులేకుండా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. అధికారిక రీచ్‌లలో ఒక లారీ ఇసుకకు బిల్లు తీసుకుని, ఆ తర్వాత రోజంతా అదే బిల్లుపై దొంగ రీచ్‌లలో పట్టపగలే లెక్కలేనన్ని ట్రిప్పులు తరలిస్తున్నారు. పర్యవేక్షించే అధికారే లేకపోవడంతో ఇష్టారాజ్యమైపోయింది. ఇప్పుడిప్పుడే నిర్మాణ రంగం పుంజుకొంటుండటంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. దీనిని ఆసరగా చేసుకొని సప్లయర్లు దోచుకుంటున్నారు. మైనింగ్ అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితం అవుతున్నారు. కనీసం జిల్లా యంత్రాంగమైనా అక్రమ ఇసుకపై చర్యలు తీసుకోకపోతుండటంపై విమర్శలు చెలరేగుతున్నాయి.

తెనాలి, గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ చూసినా దొంగ ఇసుక.. స్థానిక నేతల కనుసన్నల్లో ఒకప్పుడు గుట్టుగా సాగిన ఇసుక రవాణా ఇప్పుడు బహిరంగంగానే సాగిపోతోంది. ఉమ్మడి గుంటూరు పరిధి నుంచి వస్తున్న ఇసుక లారీలను కృష్ణా జిల్లాకు చెందిన రీచ్‌ల నిర్వాహకులు పట్టుకుంటున్నారు. అంటే ఇక్కడ తవ్వి.. తరలిస్తున్నా, అధికారులు కళ్లుమూసుకున్నట్లుగా అర్థమవుతుంది. బిల్లుతో పనిలేకుండా దొంగతనంగా తరలించడంతో ప్రభుత్వ నిర్ణయ ధరను మించి పెద్దగా పెంచకుండా అమ్మేస్తుంటే, వినియోగదారునికి మేలు జరుగుతున్నా, ప్రభుత్వ ఆదాయానికి మాత్రం గండిపడుతోంది. గతంలో ఉన్న జేపీ సంస్థ తప్పుకున్నాక, ప్రస్తుతం ఇసుక రీచ్‌లలో బిల్లులు జీసీకేసీ ప్రాజెక్ట్ అండ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరుతో ఇస్తున్నారు. ఈ కంపెనీ ప్రవేశించాక దుగ్గిరాల మండలం పెదకొండూరు, కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, బాపట్ల జిల్లా కొల్లూరు మండలం గాజుల్లంకలో కొత్త రీచ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇవికాక జగనన్న కాలనీల కోసం బుసక రీచ్‌ల కింద అన్నవరం, వల్లభాపురం దగ్గర అనుమతులిచ్చారని సమాచారం. అయితే ఇవి కాకుండా అనధికారికంగా ఇసుక తవ్వకానికి అవకాశం ఉన్న ప్రతి రీచ్‌లోనూ తవ్వేస్తున్నారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకుంటున్న పరిస్థితిలేదు. పది చక్రాల లారీ లోడు పరిమితి కేవలం 18 టన్నులు మాత్రమే ఉంటే, ఏకంగా 25 టన్నులని బిల్లుపైనే రాసిస్తున్నా, రవాణా, మైనింగ్ అధికారులు పట్టించుకుంటున్న దాఖలాలే లేవు. ప్రకాశం బ్యారేజి దిగువన కొల్లిపర, మున్నంగి, బొమ్మువానిపాలెం, అన్నవరం, బాపట్ల జిల్లాలోని చిలుమూరు, ఈపూరు, పెసర్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం రీచ్‌లలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు జరిగిపోతున్నాయి. సోమవారం రాత్రి అన్నవరపులంక దగ్గర్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న రెండు లారీలను కొత్త కంపెనీ సిబ్బంది పట్టుకుని కొల్లిపర పోలీసులకు అప్పగించారనేది సమాచారం. అయితే దీనిపై కేసు నమోదు చేశామని చెబుతున్నా, లారీలు మాత్రం యథేచ్ఛగా బయటే తిరుగుతున్నాయని కొల్లిపరలోని అధికార పార్టీ నాయకులే చెప్పడం విశేషం. నదిలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇవ్వడంతో జీసీకేసీ సంస్థ పేరుతో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అయితే ఇక్కడ ఒక బిల్లు రాయించుకుని అదే బిల్లుపై ఇతర చోట్ల ఇసుక పోసుకుని తరలిస్తున్నారు. పది చక్రాల లారీలో కేవలం 18 టన్నుల పరిమాణం వరకు మాత్రమే ఇసుక తరలించేందుకు అనుమతి ఉంటే, అధికారికంగా రీచ్‌లు తెరచిన సంస్థ బిల్లులపైనే ఏకంగా 25 టన్నుల వరకు ఇసుక పోస్తున్నట్లు రాసేసి డబ్బు వసూలు చేయడం



జీసీకేసీ సంస్థ పేరుతో కొల్లిపర మండలంలో ఇస్తున్న బిల్లులు, 25 టన్నులు పోస్తున్నట్లు ఉన్న బిల్లు

విశేషం. ఇది కాగితాలపైనే కనిపిస్తున్నా రవాణా శాఖ కానీ, సెబ్ కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. బిల్లుపై 25 టన్నులని రాసి 40 నుంచి 45 టన్నుల వరకు ఇసుక పోసేసి మిగిలిన పరిమాణానికి కంపెనీనే అనధికారిక దోపిడీకి తెరతీస్తోంది. ఇంతటి ఘరానా దోపిడీ ప్రత్యక్షంగా కనిపిస్తున్నా అంతా గప్‌చుప్ అన్నట్లు అధికారులు వ్యవహరించటం విశేషం.

దొంగ ఇసుకతో భారీగా లబ్ధి

ప్రకాశం బ్యారేజి దిగువన అధికారిక రీచ్‌లలో టన్ను ఇసుక రూ.475కు అమ్మాలని ప్రభుత్వం ధర నిర్ణయించింది. ఉదాహరణకు కొల్లిపర దగ్గర టన్ను ఇసుక రూ.475 ధర ఉంటే, తెనాలికి కిరాయి, ఇతర ఖర్చులు కలిపితే టన్ను రూ.650 వరకు పలుకుతుంది. జేపీ సంస్థ ఉన్న సమయంలోనే బిల్లుపై తీసుకొచ్చిన ఇసుకను తెనాలి పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో టన్ను రూ.750 నుంచి రూ.900 వరకు అమ్మారు. కానీ ఇప్పుడు టన్ను కేవలం రూ.550 నుంచి రూ.600 వరకే పలుకుతుంది. ఇది కొంతవరకు వినియోగదారులకు మేలు జరిగే అంశమే. అయితే వీరికి జరిగే మేలు రూ.50 నుంచి రూ.100 వరకే అయితే దొంగతనంగా ఇసుక తీసుకొచ్చి అమ్ముతున్నవారు మాత్రం రూ.వేలల్లో లబ్ధి పొందుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండికొడుతున్నారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాల్సిన సెబ్, పోలీస్, మైనింగ్ శాఖలోని విజిలెన్స్ అధికారులు కొన్నిచోట్ల నేతల సిఫార్సులు, మరికొన్నిచోట్ల మామూళ్ల మత్తుతో పట్టించుకోవడంలేదు.

బుసక పేరు చెప్పి తరలింపు..

జగనన్న కాలనీలకు మెరకలు, పునాదుల నుంచి లెంటల్ లెవల్ లోపు గదుల్లో నింపేందుకు బుసక కావాలని అధికార పార్టీ నేతల అనుచరులు అనుమతులు తీసుకున్నారు. అయితే బుసక పేరుచెప్పి ఇసుక తరలిస్తున్నారు. కొల్లిపర మండలం అన్నవరం, బొమ్మువానిపాలెం రీచ్‌లలో బుసకకు అనుమతులిస్తే, మున్నంగి, వల్లబాపురం దగ్గర కూడా తవ్వకాలు చేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పగలు బుసక తవ్వుతున్నా, రాత్రి మాత్రం ఇసుక తరలిస్తున్నారు. బొమ్మువానిపాలెం వంటి రీచ్‌ల దగ్గర బుసక అనుమతులున్నా, ఇక్కడే ఇసుక రీచ్‌కు కూడా అనుమతి ఉండటంతో పగలు కూడా అడ్డులేకుండా తరలిస్తున్నారని అధికారిక రీచ్‌ల నిర్వాహకులే చెబుతున్నారు. ఉదాహరణకు బొమ్మువానిపాలెం రీచ్‌కు అనుమతి ఉంటే, ఆ రీచ్‌లో ఒక ట్రిప్‌కు బిల్లు తీసుకుని తర్వాత ట్రిప్పులు ఆ రోజులో ఎన్ని అవకాశం ఉంటే అన్నిటిని పక్కనున్న అన్నవరం, బొమ్మువానిపాలెం బుసక రీచ్‌లలో, మున్నంగి, కొల్లిపర, వల్లభాపురం రీచ్‌లలో తవ్వుకుపోయి అమ్మేసుకుంటున్నారు. ఈ కారణంగా ప్రభుత్వానికి, అటు ఇసుక అనుమతులు దక్కించుకున్న సంస్థ ఆదాయానికి గండిపడుతోంది. మరోపక్క అధికారిక రీచ్‌లో ఒక లోడ్ 25 టన్నులకు రూ.11,875 చెల్లించి తర్వాత ట్రిప్పులకు అదే బిల్లుపై ఆ రీచ్‌లోనే రూ.7,500 నుంచి రూ.9 వేల వరకు చెల్లించి అనధికారికంగా ఇసుక తరలిస్తున్నారు.

టీడీపీతోనే.. మతసామరస్యం

- ఖురాన్ చెప్పినట్లు ధర్మం వైపు నిలబడాలి
- ముస్లీం శంఖారావం సభలో ఎంఏ షరీఫ్
- పొన్నూరులో ద్విచక్ర వాహనాలతో రోడ్ షో

పొన్నూరుటౌన్, జనవరి 10: టీడీపీతోనే మత సామరస్యం, లౌకికవాదం సాధ్యమవుతుందని శాసన మండలి మాజీ ఛైర్మన్ ఎంఏ షరీఫ్ తెలిపారు. పొన్నూరులో బుధవారం టీడీపీ ముస్లీం మైనార్టీల శంఖారావ సభ జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి చాందినీచౌక్ వరకు భారీ రోడ్ షో జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగేళ్ల ఎనిమిది నెలల్లో ముస్లింలపై జరిగిన దాడులు, అకృత్యాల వీడియోలను ప్రదర్శించారు. అనంతరం చాందినీచౌక్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 21 ఏళ్ల టీడీపీ, నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలను ముస్లీంలందరూ పోల్చిచూసుకోవాలన్నారు. ముస్లీంలకు వ్యతిరేకంగా ఉన్న నల్లచట్టాలకు పార్లమెంట్‌లో మద్దతు పలికి రాష్ట్రంలో సీఎం జగన్ నంగనాచి కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. నాలుగున్నరేళ్లుగా బీజేపీతో అంటకాగుతూ నేడు మోసం చేయాలని చూస్తోన్న జగన్‌రెడ్డికి దూరంగా ఉండాలని సూచించారు. నాటి ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు వరకు మైనార్టీల సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. టీడీపీ హయంలో 7 వేల మసీదులకు నిధులు, 5 వేల కోట్లతో కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్, దుల్హన్ పథకం, రంజాన్ తోఫా, ఉర్దూ పాఠశాలల ఏర్పాటు, వక్ఫ్ పరిరక్షణ టీడీపీ చేస్తే వాటికి తిలోదకాలు ఇచ్చిన చరిత్ర జగన్‌రెడ్డిదన్నారు. ఇస్లాం, ఖురాన్ చెప్పిన విధంగా ధర్మం వైపు నిలబడాలని, అధర్మం వైపు నిలబడితే అది దహించి వేస్తుందని షరీఫ్ తెలిపారు.



ఎం ఏ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే నరేంద్ర, ముస్లిం నేతల సంఘీభావం

వైసీపీ హయాంలో 65 దాడులు : నరేంద్ర

జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీలపై 65 దాడులు జరిగాయని, ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. బాబ్రీ ఘటన సమయంలో పొన్నూరులో ముస్లీం యువతపై కేసు పెడితే ఎదురొడ్డి నిలిచింది తన తండ్రి వీరయ్య చౌదరేనని గుర్తు చేశారు. పొన్నూరులో 7 వేల మంది ముస్లీం విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించామని, 5025 మందికి గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేసినట్లు చెప్పారు. వైసీపీ హయాంలో పొన్నూరులో ఏఎంసీ ఉద్యోగి బాషాను లారీతో ఢీకొట్టించి చంపిన ఘటన, కొత్తరెడ్డిపాలెంలో మద్యం దుకాణంపై పోరాడిన మస్తాన్‌వలీని హత్య చేసిన ఘటనలు ఉన్నాయన్నారు. తన కుమారుడు రబ్బానీ మృతిపై అనుమానాలు ఉన్నాయని మైనార్టీ నాయకుడు వైసీపీ పెద్దలను కోరితే ఎందుకు విచారణ జరిపించలేదని ప్రశ్నించారు. రోడ్డు విస్తరణ పేరుతో సంబంధంలేని ముస్లీంల షాపులు కూల్చివేస్తే వైసీపీ నాయకులు ఎందుకు నోరు తెరవడంలేదన్నారు. ఇన్ని అరాచకాలు జరుగుతుంటే జగన్‌బొమ్మను మసీదులో పెట్టి ప్రచారం చేస్తున్న ప్రబుద్ధులు పొన్నూరులో ఉన్నారన్నారు. సభలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ నాగుర్‌మీరా, టీడీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరి నజీర్, అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, ఫిరోజ్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఘని, మోసిన్ ప్రసంగించారు.



సభకు హాజరైన ముస్లింలు, టీడీపీ నాయకులు



చేయిచేయి కలుపుదాం.. అభివృద్ధి సాధిద్దాం

6లో..

- టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ పిలుపు
- తటస్థ ప్రముఖులతో కొనసాగుతున్న భేటీలు

మిర్చిపై.. తెగుళ్ల దాడి

- భారీగా తగ్గనున్న దిగుబడులు
- పూతతో పాటు రాలిపోతున్న కాయలు
- చలికాలం ఆరంభం నుంచి పెరిగిన ఉధృతి
- పెట్టుబడులూ తిరిగిరావని రైతుల్లో ఆందోళన
- మూడు జిల్లాలో రెండు లక్షల ఎకరాల పంటపై ప్రభావం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంటల సాగుకు ప్రకృతి సహకరించడంలేదు. అతి వృష్టి.. అనావృష్టితో ఇప్పటికే మిరప పంటపై తీవ్ర ప్రభావం చూపించగా ప్రస్తుతం తెగుళ్ల దాడితో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఒకటి రెండు కాదు ఏకంగా నాలుగైదు రకాల తెగుళ్ల సోకడంతో రైతులు విలవిలాడుతున్నారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో నీటి తడి ఖర్చు చాలదనట్లుగా తెగుళ్ల ఆశించాయి. దీంతో పంటను కాపాడు కునేందుకు ఖరీదైన మందులను పిచికారి చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెగుళ్ల కారణంగా పెట్టుబడులూ తిరిగిరావన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. నల్ల తామర, కొమ్మ ఎండు, నల్ల, తెల్ల, పచ్చ నల్లి, ఆకు ముడత, కాయకుళ్లు, వేరు కుళ్లు తెగుళ్ల సోకాయి. చలికాలం ఆరంభం నుంచి తెగుళ్ల ఉధృతి పెరిగింది. తెగుళ్ల వల్ల పూతతో పాటు కాయలు రాలిపోతున్నాయి. మొక్కలు ఎండిపోతున్నాయి.

ఎకరాకు రూ.10 నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేసి పంటను కాపాడుకుంటున్న తరుణంలో తెగుళ్ల దాడి చేశాయి. అటు వర్షాభావం, ఇటు తెగుళ్ల నుంచి మిరపను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు చెప్పనలవికావు. పంట పూత, కాపు దశలో తెగుళ్ల బెడద మొదలైంది. చలితో పాటు మంచు ఎక్కువగా కురుస్తుండటంతో తెగుళ్ల తీవ్రత పెరిగింది. కొన్ని చోట్ల ఆకుముడత, మచ్చ తెగుళ్ల వల్ల పంటలో ఎదుగుదల లేదు. మొక్కకున్న ఆకులు రాలిపోవడంతో పాటు మొక్కలు ఎండిపోతున్నాయి. కాయలు కుళ్లి ఎండి రాలిపోతున్నాయి. నల్ల తామరతో పూత రాలిపోతున్నది. వైరస్, నల్ల, పచ్చ, తెల్ల నల్లి సోకడంతో కాయ రాలిపోతున్నది. తెగుళ్లతో దిగుబడులు భారీగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు లక్షన్నర ఎకరాల్లో పంటపై తెగుళ్ల ప్రభావం ఉంది. ఈ ఏడాది విత్తనాల ధరలు, సాగు వ్యయం కూలీల ఖర్చులు పెరగడం, మరోవైపు తీవ్ర వర్షాభావంతో నీటి ఖర్చు అధికమైంది. ఇప్పటికి సాగు వ్యయం లక్షన్నర వరకు అయిందని రైతులు చెబుతున్నారు. తెగుళ్ళు, వర్షాభావం, అధికవర్షాలకు పంట దెబ్బతినడంతో పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అకుమడత తెగులు సోకిన మొక్క, తెగులు సోకి కుళ్లి పోతున్న కాయ

నాడు ఆసక్తి.. నేడు నిరాశ

మిరపకు మంచి ధర ఉండటంతో పంట సాగుపై రైతులు ఆసక్తి చూపారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 1,89,770 ఎకరాల్లో మిరప సాగైంది. పల్నాడు జిల్లాలో అత్యధికంగా రైతులు ఈ ఏడాది మిర్చి సాగు చేపట్టారు. తేజ, బాడిగ, వండర్‌హాట్, చపాటా వంటి రకాలను ఎక్కువగా సాగు చేశారు. మొక్కలు నాటినప్పటి నుంచి తీవ్ర వర్షాభావం నెలకొంది. నీటిని కొనుగోలు చేసి తడులిచ్చి పంటను కాపాడుకున్నారు. డిసెంబరులో కురిసిన భారీ వర్షాలకు పంట దెబ్బతిన్నది. మళ్లీ నెలరోజులుగా తీవ్ర వర్షాభావం నెలకొంది. పంటను కాపాడుకునేందుకు రైతులు భగీరథ యత్నం చేస్తున్నారు.



వైరస్ సోకిన మిర్చి మొక్క

పట్టించుకోని వ్యవసాయశాఖ

తెగుళ్ల నివారణకు నిర్దిష్ట పురుగు మందులు లేకపోవడంతో ఇతర పంటలకు వాడే వాటినే మిరపకు వాడుతున్నారు. పంట యాజమాన్య పద్ధతులు, పురుగు మందులు వినియోగంపై రైతులకు అధికారులు సూచించక పోవడంతో ప్రైవేట్ కంపెనీలు లాభాల కోసం అనేక రకాల పురుగు మందులను సిఫార్సు చేస్తున్నాయి. పంట వేసిన మొదట్లో ఆకు ముడత వైరస్ వాహకంగా ఉండే తెల్లదోమ, ఆ తదుపరి నల్ల తామర, వైరస్ వల్ల దిగుబడి గణనీయంగా తగ్గుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల నివారణకు ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. వర్షాభావం నుంచి కాపాడుకున్న పంటను తెగుళ్ల మింగేస్తుండటంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వాతావరణంలో మార్పులు వస్తే తెగుళ్ల ప్రభావం తగ్గే అవకాశం ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

మిరపసాగు జిల్లాల వారీగా..

జిల్లా	సాగు ఎకరాల్లో
పల్నాడు	1,25,881
బాపట్ల	25,337
గుంటూరు	38,550



పొలంలో ఏర్పాటు చేసిన బంక అట్టలకు నల్లి పురుగులు


తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

మూడు రాజధానులు చట్ట వ్యతిరేకం

● 1485 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు జనవరి 10: సీఎం జగన్‌రెడ్డి పెట్టిన మూడు రాజధానుల ప్రతిపాదన చట్ట వ్యతిరేకమన్నారు. అందుకే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మూడు రాజధానుల అంశం వద్దు.. అమరావతినే రాష్ట్ర ఏకైక రాజధాని పేర్కొని, అభివృద్ధి పనులను కొనసాగించమని మాండమస్ తీర్పునిచ్చిందని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతుకూలీలు మహిళలు చేస్తున్న ఆందోళన బుధవారం నాటికి 1485వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు ధర్నా శిబిరాల నుంచి పలువురు మాట్లాడుతూ.. పార్లమెంటు చేసిన విభజన చట్టం ప్రకారం ఒన్ క్యాపిటల్ అని ఉందన్నారు. ఆ ఒన్ క్యాపిటల్ అమరావతి ఏర్పడి పోయిందన్నారు. ఏడున్నర ఏళ్ళ నుంచి రాజధాని అమరావతి నుంచే చేసుకొని పాలన సాగుతుందనీ, ఇలాంటప్పుడు మూడు రాజధానులు అన్నవి చట్టవ్యతిరేకమైనవని అన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

విద్యుత్‌విజిలెన్స్ బృందాల తనిఖీలు

● 141 మందికి రూ.7.63 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, జనవరి 10: విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈఈ (డీపీఈ) కే.సూర్యప్రకాష్, ఆపరేషన్ ఈఈ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 45 మంది అధికారులు 135 మంది సిబ్బంది 45 బృందాలుగా ఏర్పడి ముప్పాళ్ళ, దమ్మాలపాడు, తురకపాలెం, గొల్లపాడు, మాదల, ఇరుకుపాలెంలలో తనిఖీలు నిర్వహించినట్లు డీపీఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2658 సర్వీసులు తనిఖీ చేసి అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 141 మందికి రూ.7.63 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం నేరమని, చౌర్యానికి పాల్పడే వారిపై 9440812263, 9440812360కు ఫిర్యాదులు చేయాలని ప్రజలకు సూచించారు.

చేయిచేయి కలుపుదాం.. అభివృద్ధి సాధిద్దాం

● టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ పిలుపు

● తటస్థ ప్రముఖులతో కొనసాగుతున్న భేటీలు


దొంతిరెడ్డి మురళీకృష్ణారెడ్డితో నారా లోకేశ్

తాడేపల్లి టౌన్, జనవరి 10 : రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం చేయిచేయి కలిపి ముందుకు సాగుదామని, అభివృద్ధిని సాధిద్దామని టీడీపీ జాతీయ కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా, మంగళగిరి నియోజకవర్గంలోని తటస్థ ప్రముఖులతో లోకేశ్ జరుపుతున్న భేటీలలో భాగంగా బుధవారం తాడేపల్లికి చెందిన ప్రముఖులు దొంతిరెడ్డి మురళీకృష్ణారెడ్డి, కాజ లక్ష్మీప్రసాద్, బుద్దా సోమేశ్వరరావులను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తొలుత 4వవార్డులోని మురళీకృష్ణారెడ్డిని కలుసుకుని మాట్లాడారు. అనంతరం తాడేపల్లి మహానాడు కాలనీకి చెందిన ప్రముఖ బీసీ నేత శ్రీప్రతిభ స్కూల్ అధినేత కాజ లక్ష్మీప్రసాద్‌ను ఆయననివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం విలీనం పేరుతో ఎయిడెడ్ పాఠశాలల ఆస్తులను కొల్లగొడుతూ పేద విద్యార్థులకు ద్రోహం చేస్తుందన్నారు. కాగా 23వ వార్డుకు చెందిన బుద్దా సోమేశ్వరరావు (బీసీ ప్రముఖుడు) ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఆరోగ్యసేవలు విస్తరించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. లోకేశ్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చి దిద్దడానికి నియోజకవర్గంలోని ప్రముఖులంతా కలిసిరావాలని కోరారు. మరో మూడు నెలల్లో ప్రభుత్వం మారుతుందని, టీడీపీ అన్ని వర్గాలకు అండగా నిలుస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని వర్గాల సహాయంతో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వల్లభనేని వెంకట్రావు, తమ్మిశెట్టి జానకీదేవి, కాటాబత్తుల నిర్మల, దారా దాసు, అన్నెం కుసుమ, కాజ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.


బుద్దా సోమేశ్వరరావుతో నారా లోకేశ్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు కాకాణి గోవర్ధనరెడ్డి, అంబటి రాంబాబు, ఇజ్రాయెలు రాయబారి నవోర్ గీలోన్, ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు, కలెక్టర్ శివశంకర్

ఇండో-ఇజ్రాయెల్ ప్రాజెక్టు శంకుస్థాపన

● రూ.10 కోట్ల వ్యయంతో 25.57 ఎకరాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మాణం

● హాజరైన మంత్రులు కాకాణి, అంబటి, ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు ఇజ్రాయెలు రాయబారి నవోర్ గీలోన్

నకరికల్లు, జనవరి 10 : ఇండో ఇజ్రాయెలు వ్యవసాయ ఆధారిత ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి అందుబాటులోకివస్తే రైతులకు ఎంతో ఉపయోగకరమని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. బుధవారం పల్నాడు జిల్లా నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో ఇండో ఇజ్రాయేలు సమర్థత కేంద్రంకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తొలుత ఉద్యానశాఖ ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలతో పాటు సమర్థత కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కేంద్రాల ద్వారా రైతులకు శాస్త్రసాంకేతిక ఆధునిక విధానాలను అందుబాటులోకి తేవడంతో పాటు, శిక్షణ కూడా ఇస్తామన్నారు. మంత్రి అంబటి మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే ఈ కేంద్రం రాష్ట్రంలో రెండవది కావటం, పల్నాడు ప్రాంతంలో ఏర్పాటు చేయటం రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఇజ్రాయెలు రాయబారి నవోర్ గీలోన్ మాట్లాడుతూ భారత్, ఇజ్రాయేలు సత్సంబాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఇండో ఇజ్రాయెలు ప్రాజెక్టులు వ్యవసాయంలో రైతుల ఆర్థికాభివృద్ధికి ఎంతో ఉపకరిస్తాయన్నారు. తక్కువ నీటి లభ్యత ఉన్నప్పటికీ ఉన్న వసతులతోనే సాంకేతికతను ఉపయోగించుకొని అధిక దిగుబడులు సాధించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్ లోతేటి, జేసీ ఏ శ్యామ్‌ప్రసాదు, అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ, ఎస్.శ్రీధర్, బెన్ని, సాయి మాల కొండారెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మైనార్టీలపై దాడులు పెరిగాయి

● శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్

● వైసీపీ నేతల దాడిలో మృతిచెందిన మస్తాన్‌వలి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్లతో కలసి పరామర్శ


షరీఫ్, నరేంద్రలకు మస్తాన్‌వలీ ఫోటోను చూపిస్తున్న కుటుంబసభ్యులు

చేబ్రోలు, జనవరి10: వైసీపీ ప్రభుత్వం పాలనలో రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీలపై దాడులు పెరిగాయని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ ధ్వజమెత్తారు. పొన్నూరు నియోజకవర్గం, చేబ్రోలు మండలం, కొత్తరెడ్డిపాలెం గ్రామంలో ఇటీవల వైసీపీ నేతల దాడిలో మృతి చెందిన షేక్ మస్తాన్‌వలీ కుటుంబాన్ని బుధవారం ఎంఏ షరీఫ్, ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌లు కలసి పరామర్శించారు. మస్తాన్‌వలీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలీ కుటుంబ సభ్యులు షరీఫ్ వద్ద కన్నీరుమున్నీరవుతూ తమ ఆవేదనను వెలిబుచ్చారు. షరీఫ్ వారిని ఓదార్చి ఆర్థికసాయం అందజేశారు. అనంతరం షరీఫ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిందని దుయ్యబట్టారు. కల్లబొల్లి మాటలతో ముస్లిం ఓట్లు పొంది అధికారంలోకి వచ్చిన సీఎం జగన్‌రెడ్డి గతంలో ముస్లింలకు టీడీపీ అందించిన సంక్షేమ పథకాలన్నింటినీ నిలిపివేసిందన్నారు. టీడీపీ హయాంలో అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను గురించి గుర్తు చేసారు. వచ్చే టీడీపీ ప్రభుత్వంలో ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేసి ముస్లింల అభ్యున్నతికి వడ్డీలేని రుణాలు ఇవ్వనున్నట్లు నారా లోకేశ్ హామీ ఇచ్చారని అన్నారు. రానున్న ఎన్నికలో ప్రతి ముస్లీం టీడీపీకి అండగా నిలవాలని షరీఫ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, ముస్లీంలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఇజ్రాయిల్ రాయబారి నవోర్ గీలోన్

భారత్ -ఇజ్రాయిల్ సంబంధాలు మరింత బలోపేతం

●ఇజ్రాయిల్ రాయబారి నవోర్ గీలోన్

గుంటూరు(విద్య),జనవరి 10: భారత్-ఇజ్రాయిల్ దేశాలమధ్య వ్యవసాయ రంగం విభాగంలో టెక్నాలజీతోపాటు పరస్పర అవగాహన సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని భారతదేశంలో ఇజ్రాయిల్ రాయబారి నవోర్‌గీలోన్ అన్నారు. చేబ్రోలుమండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీని ఆయన బుధవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్‌తో పాటు దౌత్యపరమైన అంశాల గురించి విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్‌తో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ రాయబారి నవోర్ గీలోన్‌తో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగ భూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వివిధ విభాగాల డీన్లు, అధిపతులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాబోయే కాలంలో ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సరికొత్త టెక్నాలజీ, ఇండస్ట్రీ, అకడ మియా ప్రోగ్రామ్స్ రూపొందిచడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	90, 99, 108
చికెన్ విత్ స్కిన్	174.00
చికెన్ స్కిన్ లెస్	184.00

ప్రైవేటు బ్యాంకు సిబ్బంది వేధిపులతో యువకుడు బలవన్మరణం

దాచేపల్లి, జనవరి 10: ప్రైవేటు బ్యాంకు రికవరీ ఏజెంట్లు వేధింపులు తాళలేక ఓ యువకుడు బలవన్మరణం పొందిన సంఘటన బుధవారం దాచేపల్లి నగర పంచాయతీ నడికూడి గ్రామంలో జరిగింది. మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోళ్ల అజయ్‌కుమార్ (31) పిడుగురాళ్లలోని ప్రైవేటు ఆస్పత్రిలో ఉద్యోగిగా పనిచేస్తూ ప్రైవేటు బ్యాంకులో రూ.7 లక్షలకుపైగా రుణంపొందాడు. తీసుకున్న రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నా డిసెంబరులో ఈఎంఐ చెల్లించకపోయాడు. దీంతో బ్యాంక్ రికవరీ సిబ్బంది రోజుకు 40 నుండి 50 సార్లు ఫోన్‌చేసి ఈఎంఐ కట్టాలంటూ తీవ్ర ఒత్తిడి చేశారు. దీంతో మానసిక ఆవేదనకు గురైన అజయ్‌కుమార్ తన నివాస గృహంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి వివాహం కాలేదు. తండ్రి సాంబశివరావు, తల్లి వున్నారు. ప్రతినెల చెల్లిస్తున్నా, ఒక నెల వాయిదాకే బ్యాంక్ సిబ్బంది అజయ్‌కుమార్‌ను తీవ్రంగా వేధించారని, దీంతో ఏర్పడిన మానసిక ఒత్తిడి వల్లనే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం కుటుంబ సభ్యులు అజయ్‌కుమార్ ఆత్మహత్య విషయాన్ని దాచేపల్లి పోలీసులకు తెలియ జేశారు.

కృష్ణానదిలో పడి యువకుడి మృతి

దాచేపల్లి, జనవరి10: దాచేపల్లిమండలం తంగెడ వద్ద కృష్ణానదిలో చేపలుపడుతూ ప్రమాదవశాత్తు నదిలోపడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం తంగెడ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతుల క్రాంతి కుమార్(29) వ్యవసాయకూలీగా, సిమెంట్ ఫ్యాక్టరీలో చిరు ఉద్యోగిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఖాళీ సమయంలో గ్రామానికి సమీపంగా వున్న కృష్ణానదిలో చేపలు పడుతూ షికారు కొడుతుంటాడు. మంగళవారం నదిలోచేపలు పట్టేందుకు వెళ్లిన క్రాంతికుమార్ ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. స్థానికుల నుంచి విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆ రాత్రంతా నదిలో వెతుకులాట ప్రారంభించగా బుధవారం మృతదేహం లభ్యమైంది. మృతుడు క్రాంతి కుమార్‌కు భార్య రాజేశ్వరి, ఐదు, రెండేళ్ల వయసు కలిగిన బాలిక, బాలుడు వున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


రైతు సేవా కేంద్రం ఊహాచిత్రం, పూర్వ విద్యార్థి హరిప్రసాద్

పూర్వ విద్యార్థి సంకల్పం.. రైతు సేవాకేంద్రం నిర్మాణం

● విశ్వవిద్యాలయం అనుమతులు జారీ

● ఫిబ్రవరి 11 న నిర్మాణ పనులకు శ్రీకారం

బాపట్ల, జనవరి 10 : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాలలో రైతు సేవా కేంద్రం ఏర్పాటుచేసి ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేయాలని కళాశాల పూర్వ విద్యార్థి (1980 బ్యాచ్) నుంకు హరిప్రసాద్ సంకల్పించారు. కేంద్రం నిర్మాణానికి రూ.50 లక్షలు విరాళం ప్రకటించారు. ఆయన ఆలోచన, ప్రయత్నానికి యూనివర్సిటీ నుంచి తాజాగా అనుమతులు వచ్చాయి. దీంతో ఫిబ్రవరి 11న భూమిపూజ చేసేందుకు ముందుకొచ్చారు. 75 సంవత్సరాల కళాశాల చరిత్రలో ఇంత వరకు వ్యక్తిగతంగా ఇంత భారీ ఆర్థిక సహకారం అందించిన వారులేరు. అనంతపురంజిల్లా తాడిపత్రి రైతు కుటుంబానికి చెందిన హరిప్రసాద్ ఇంటర్ వరకు అక్కడే చదువుకొని 1980లో బాపట్ల వ్యవసాయ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు. ఆతర్వాత ఎంబీఏ పూర్తిచేసి అనేక కంపెనీలలో వివిధ హోదాలలో పనిచేసి అపార అనుభవం గడించారు. తర్వాత ఆయనే స్వయంగా 1992లో ఎగుమతులు, దిగుమతులు, పలు ఉత్పత్తి తయారికి సంబంధించిన వ్యాపారం ప్రారంభించి అంచలంచలుగా ఎదిగి అనేకమందికి మార్గదర్శిగా నిలిచారు. ప్రస్తుతం బెంగుళూరు కేంద్రంగా మేవాగ్రూప్ కంపెనీల ఎండిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 11నే వ్యవసాయ సమాచార కేంద్రం నిర్మాణంతో పాటు, విద్యార్థుల సహకారంతో నిర్మించిన అతిథిగృహాన్ని ప్రారంభించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీ.శ్రీనివాసరావు తెలిపారు.

70,571 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 72,053 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 70,571 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 41,837 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000	334	13500	19000
నెంబరు. 5	9000	17500	నెంబరు. 5	–	–
273	10000	16000	273	–	–
341	9000	20000	341	10500	17800
4884	11500	15500	4884	–	–
సూపర్ 10	--	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	22700	తేజ	11000	21000
బ్యాడిగి	8500	23000	బ్యాడిగి	11000	13500
దేవనూరు డీలక్స్	9500	21000	దేవనూరు డీలక్స్	–	–
తెల్లకాయలు	5000	13000	తెల్లకాయలు	5000	12000

పరిశోధనలు, విస్తరణలు చేపట్టాలి

● ముగిసిన 53వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం


సమావేశంలో పాల్గొన్న వీసీ, పరిశోధన సంచాలకులు

లాంఫాం(తాడికొండ)జనవరి 10: వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి కొత్త పరిశోధనలు, విస్తరణలు చేపట్టాల్సిన అవశ్యకత ఎంతో ఉందని రైతులు, ఎన్‌జీవోలు సూచించారు. ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న 53వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం బుధవారంతో ముగిసింది. రెండవ రోజు సమావేశంలో బెంగుళూరుకు చెందిన డాక్టర్ పీ.డీ కమల జయంతి సీమియో కెమికల్స్, స్థిరమైన సమగ్ర సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఐఐఆర్ హైదరాబాద్ నుంచి డాక్టర్ ఎం.సోమశేఖర్ 'వ్యవసాయంలో మొక్కల పరాన్నజీవ నెమటోడ్ల సమస్యల నిర్వహణ' అనే అంశంపై మాట్లాడారు. ఐసీఏఆర్, ఎన్ఐఏఎస్ఎం భారమతి డైరక్టర్ డాక్టర్ కే.సమ్మిరెడ్డి 'కార్బన్ క్రెడిట్' అనే అంశంపై అవగాహన కల్పించారు. ముత్యాల సాగు, కుంకుమ పువ్వు సాగుపై రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ప్రధాన శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వ్యవసాయంలో కొత్త అంశాల్ని గుర్తించి వాటిపై ఈ సంవత్సరంలో పరిశోధనలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మీదేవి, స్పెషల్ ఆఫీసర్, మాజీ వీసీ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్‌రెడ్డి, పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్ .ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఏ.సుబ్బారామిరెడ్డి, పాలక మండలిసభ్యులు డాక్టర్ పీవీ సత్యగోపాల్, శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ పీ.రాఘవరెడ్డి, డాక్టర్ శ్రీరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

కారంపూడి, జనవరి 10: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని పేటసన్నిగండ్ల తండాలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన శ్రీనునాయక్ (26) పొలంలోని మోటారుకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పక్కనేవున్న స్తంభాన్ని ఎక్కి ఫీజ్ వేసేందుకు ప్రయత్నించాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తూ మెయిన్ వైర్ తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామాంజినేయులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దేగల ప్రభాకర్

'కాపు'కాసింది చంద్రబాబే..

● టీడీపీ నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్

గుంటూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కాపులకు టీడీపీ ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కాపులను ఎల్లప్పుడు కంటికిరెప్పలా కాస్తూనే ఉన్నారని, కానీ జగన్‌రెడ్డి కాపులను ప్రతి సందర్భంలోనూ అణగదొక్కుతూను ఉన్నాడని టీడీపీ నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ అన్నారు. స్థానిక టీడీపీ నగర కార్యాలయంలో బుధవారం ఆయన 'కాపు కాసింది చంద్రబాబే' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాపులకు అన్యాయం చేసిన ద్రోహి జగన్ రెడ్డి అని మండిపడ్డారు. కాపులకు అన్నివిధాలా పెద్దపీట వేసింది ఒక్క చంద్రబాబు నాయుడు మాత్రమే అని అన్నారు. టీడీపీ హాయంలో కాపులకు రూ. 4,200 కోట్ల కేటాయించిందని, కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి స్వయం ఉపాధి రుణాల కింద 2,11,099 మంది లబ్ధిదారులకు రూ.2,918 కోట్ల రుణాలు అందించారన్నారు. విదేశీ విద్య దీవెన పథకం క్రింద 1892 మందికి, ఒక్కొక్కరికి రూ.10లక్షలతో పాటుగా, విమానటికెట్‌నూ ఉచితంగా మంజూరు చేశారన్నారు. గుంటూరు జిల్లాలో సుమారు 400 మందిని విదేశాలకు పంపి చదివించారన్నారు. కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం భారీగా నిధులు కేటాయించిందన్నారు. కాపుల సంక్షేమం, అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేసిన టీడీపీ ప్రభుత్వం కావాలో, కాపులకు ద్రోహం చేసిన వైసీపీ ప్రభుత్వం కావాలో కాపులు ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం కాపు నాయకులు యర్రగోపు నాగేశ్వరరావు, బొక్కిసమ్ శివరామ్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్.రామారావు, ఎం.బాబురావు, ఏ.ప్రసాద్ బాబురావు, కన్నసాని బాజీ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాటూరీలో ఏఆర్‌టీ థెరపీ సేవలు

గుంటూరు (మెడికల్) జనవరి 10: ఎయిడ్స్ రోగులు క్రమం తప్పకుండా యాంటీ రెట్రోవైరల్ థెరపీ(ఏఆర్‌టీ) మందులు వాడితే హెచ్‌ఐవీ వైరల్ లోడ్ పూర్తిగా తగ్గిపోయి ఆరోగ్యంగా జీవించవచ్చని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీశ్యాక్స్) అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ వై.కామేశ్వర ప్రసాద్ తెలిపారు. బుధవారం చినకోండ్రుపాడులోని కాటూరి జనరల్ హాస్పిటల్‌లో పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ కింద నూతనంగా ఏర్పాటు చేసిన ఎయిడ్స్ చికిత్స కేంద్రం (ఏఆర్‌టీ సెంటర్) ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏపీ శ్యాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల, జాయింట్ డెరెక్టర్ డాక్టర్ మంజుల రోగులకు మందులు అందజేశారు. కార్యక్ర మంలో కాటూరి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహన్‌రావు, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామకోటిరెడ్డి, డ్యాప్కు డీపీఎం ఎల్ మధుసూదనరావు, ఏఆర్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది శిఖా బెనర్జీ మృతి

గుంటూరు(లీగల్), జనవరి 10: గుంటూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది శిఖాబెనర్జీ (65) బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. శిఖాబెనర్జీ గత ఏళ్ళుగా న్యాయవాదవృత్తిలో ఉన్నారని, తొలుత టీడీపీ లీగల్‌సెల్ సభ్యుడుగా ఉన్న ఆయన రెండు పర్యాయాలలో కలిపి 9ఏళ్ళ పాటు గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. శిఖాబెనర్జీకి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారధి, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, ఏపీపీలు శ్రీకాంత్ బ్రహ్మారెడ్డి, సుకుమార్ తదితరులు బెనర్జీ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మునిసిపల్ ఆర్‌డీకార్యాలయం వద్ద ధర్నా

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 10 : గుంటూరు మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. శంకర్ విలాస్ సెంటర్ నుండి ఆర్‌డీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం అక్కడ బైఠాయించి సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో కోట మాల్యాద్రి, ఆళ్ల హరి పాల్గొన్నారు.

అణిచివేతతో ఉద్యమాలు ఆపలేరు

● సమస్యలను పరిష్కరించడం మినహా మరో మార్గం లేదు
● స్పష్టం చేసిన అంగన్‌వాడీ యూనియన్ నేతలు
● నిరసనలు మొదలై నెల రోజులు పూర్తి



నిరసనలు నెల రోజులు పూరైన సందర్భంగా అంగన్‌వాడీల వినూత్న నిరసన

గుంటూరు(తూర్పు), జనవరి10: నోటీసులు, ఎస్మా చట్టాలను ప్రయోగించడం, ఇతర బెదిరింపులకు భయపడే ప్రసక్తేలేదని అంగన్‌వాడీ యూనియన్ నేతలు స్పష్టం చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ గుంటూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె నెల రోజుల పూరైన సందర్భంగా వినూత్న నిరసనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విధుల్లోకి రావాలని అధికారులు ఫోన్లు చేయడం అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు, ఇంటికి నోటీసులు ఇవ్వాలని ఉన్నాతాధికారులు ఆదేశాలు ఇవ్వడంపై అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్ర హం వ్యక్తంచేశారు. ఉక్కుపాదంతో ఉద్యమాలను నిలువరించలేరని, గతంలోన కార్మికులపై ఎస్మా ప్రయోగించిన ఏ ప్రభుత్వమూ మనుగడ సాగించిన దాఖాలులేవని గుర్తుచేశారు. అనంతరం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా (సిఐటియు) నాయకులు నగర కార్యదర్శి టి.రాధ, దీప్తి మనోజలు మాట్లాడుతూ 30రోజుల నుంచి రోడ్లపై ఉండి నిరసనలు తెలుపుతున్నా కానీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పైగా నేటినుంచి విధుల్లోకి రావాలని, లేని పక్షంలో తొలిగిస్తామని అధికారులు హెచ్చరించడం దారుణమన్నారు. డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెలోనే ఉంటామని, విధుల్లోకి వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సమ్మెకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సీపీఐ(ఎమ్ఎల్)ప్రజాపోరు నాయకులు పీ. కోటేశ్వరరావు అంగన్‌వాడీల దీక్షలకు సంఘీభావం తెలిపారు. రిలే దీక్షలలో అంగన్‌వాడీలు టీ.రాధ, కే శివకుమారి, ఏ.పద్మావతి, బసవపున్నప్ప, జ్యోతి, భార్గవి, నాగలక్ష్మీలు పాల్గొనగా, నిరసనల్లో అంగన్‌వాడీల యూనియన్ నేతలు వెంకాయమ్మ, నాగమణీ, రమాదేవి, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తూర్పు నియోజకవర్గ అభివద్ధే నా లక్ష్యం

● టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్
● 'నేను- నా నియోజకవర్గం' ప్రచార రథం ప్రారంభం



డిజిటల్ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న శ్రావణ్‌కుమార్, నసీర్, చిట్టిబాబు

గుంటూరు, జనవరి10 (ఆంధ్రజ్యోతి): గుంటూరుతూర్పు నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. పార్టీ తూర్పు కార్యాలయంలో ఆయన జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి 'నేను-నా నియోజకవర్గం' పోస్టర్లను ఆవిష్కరించి, ప్రచారరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ జగన్ అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి జరగని అభివృద్ధిని, అందని సంక్షేమ పథకాలను గురించి తనసొంత ఛానల్‌లో పత్రికలలో పబ్లిసిటీ చేసుకుంటూ ప్రచారపిచ్చితో ప్రజల సొమ్మును స్వాహచేస్తూ, వారిని మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. గుంటూరు తూర్పులో చంద్రబాబు గతంలోచేసిన అభివృద్ధి గురించి ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు డిజిటల్ వాహనాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నాలుగు సంవత్సరాల్లో ఏంచేశాడో సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో చిట్టాబత్తిన చిట్టిబాబు, కార్పొరేటర్లు ముప్పవరపు భారతి, పోతురాజు సమత, శ్రీను నాయక్, జమీర్, వజ్జా లక్ష్మి, విజయలక్ష్మి, సురే శ్రీనివాస్, చిలక వెంకటేశ్వర్లు, గుడిపల్లి వాణి, హఫీజ్, నాయుడు మల్లికా, మురళి, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసుల జారీ అనైతికం

● యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కళాధర్

గుంటూరు(తూర్పు), జనవరి10: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న సమగ్ర, శిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు ఇవ్వడం అనైతికమని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కళాధర్ అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఉద్యోగుల నిరసన బుధవారం నాటికి 22వ రోజుకు చేరుకుంది. జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షులు బీ.లక్ష్మణరావు మాట్లాడుతూ డిమాండ్లను పరిష్కరించేవరకు సమ్మెలోనే ఉంటామని స్పష్టం చేశారు. యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నేతలు దీక్షలకు మద్దతలు తెలిపారు. ధర్నాలో యూనియన్ నేతలు ప్రకాష్, అబ్దుల్ రెహమాన్, యం.గంగయ్య, కే.కిరణ్ కుమార్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

● రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాదు

గుంటూరు(తూర్పు),జనవరి10: విజయవాడ, స్వరాజ్య మైదానంలో, ఈనెల19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించనున్న 125 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ కోరారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విగ్రహాన్ని స్వేచ్ఛ, సమానత్వానికి గుర్తుగా (స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ, లిబర్టీ) పిలుస్తామని అన్నారు. ముందుగా అతిథి గృహానికి వచ్చిన ఆయనకు ఆర్డీవో శ్రీకర్, పశ్చిమ తహసీల్దారు సాంబశివరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయింది

● టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నేత తాళ్ళ వెంకటేష్ యాదవ్

గుంటూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమయిందని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ నేత తాళ్ళ వెంకటేష్ యాదవ్ అన్నారు. జగన్‌రెడ్డి రాష్ట్రంలో చేస్తున్న అరాచకాలపై ఆయన బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. సీఎం జగన్‌రెడ్డికి జగన్మోహన్ రెడ్డికి ముదిరి పాకాన పడిందని, అందుకు ఆయన పిచ్చిచేష్టలే నిదర్శనమన్నారు. ఏ ప్రభుత్వానికైనా ప్రజా సంక్షేమం, అభివృద్ధి, కళ్ళు కాగా, వైసీపీ ప్రభుత్వ పాలనలో వాటి ఊసే లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో వైసీపీ నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి పాలనసాగిస్తున్నారన్నారు. కడపలో జగన్మోహన్‌రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రాజాగోపాల్‌రెడ్డి చర్యలపై అక్కడి ప్రజలు ఫిర్యాదు చేస్తే, ఆయనను విచారణకు రమ్మని చెప్పిన వెల్ది సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను చావగొట్టి, చంపుతామని బెదిరించారన్నారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు.

బాలికతో అసభ్య ప్రవర్తనపై ఫోక్సో కేసు

గుంటూరు, జనవరి 10 : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుజ్జనగుండ్లలో ఓ వ్యక్తి పదేళ్ళ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై పోలీసులు బుధవారం ఫోక్సో కేసు నమోదు చేశారు. సుమారు 55 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి తన పక్కింటికి చెందిన బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆయా కుటుంబాల మధ్య ఆస్తి వివాదం ఉండటంతో ఈ ఈ కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కార్మికులకు మద్దతుగా రాజకీయ పోరాటం అనివార్యం

●రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి10: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు, ఇతర కాంట్రాక్టు ఉద్యోగులు చేస్తున్న ఉద్యమానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తమ నైతిక మద్దతు తెలియజేయడంతో పాటు వారు కొనసాగిస్తున్న ఉద్యమంలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు నిర్ణయించారు. అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతుగా, అంగన్‌వాడీ కార్మికుల ఉద్యమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మాను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీపై జిల్లా సమితి ఆధ్వర్యంలో కొత్తపేట, మల్లయ్యలింగంభవన్లో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం ర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులకు ప్రజాస్వామ్యం లేకుండా చేసే దమననీతిని ప్రభుత్వం ప్రదర్శిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మికులలో ధైర్యాన్ని నింపి ఎంతటి పోరాటానికైనా ముందుకు సాగుదామని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్, సీపీఐ(ఎంఎల్), మ్యాడెమోక్రసీ జిల్లా నాయకులు గనిరాజు, జిల్లా కార్యదర్శి వి.నరసింహారావు, నాయకులు కృష్ణ, సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, జనతాదళ్ నాయకులు సాంబశివరావు, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

సీఎంపై చీటింగ్ కేసు నమోదు చేయాలి

● ఎస్పీ కార్యాలయంలో తెలుగుయువత నేతల ఫిర్యాదు

గుంటూరు, జనవరి 10: ప్రతి ఏటా జనవరి 1నన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మెగా డీఎస్సీలు నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని, ప్రభుత్వ శాఖల్లో 2.30 లక్షల ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని గత ఎన్నికల సందర్భంగా హామీలు గుప్పించి, అధికారం పొందిన అనంతరం ఆవేమీ అమలుచేయకుండా నిరుద్యోగులను మోసం చేసిన సీఎం జగన్‌పై చీటింగ్ కేసు నమోదు చేయాలని కోరుతూ బుధవారం తెలుగు యువత నేతలు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో నమోదవుతున్న నిరుద్యోగుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని స్పష్టంచేశారు. ఇందుకుగాను సీఎం జగన్‌రెడ్డిపై ఏపీ సీఐడీ క్రిమినల్ కేసుపెట్టి విచారించాలని జిల్లాక్రైమ్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావును కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు షేక్.ఫిరోజ్, ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా బాబు, ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్, కొండెపు శేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం

గుంటూరు సిటీ, జనవరి 10 : నగరంలోని ప్రజలకు కనీస మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పచ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ విమర్శించారు. నగరంలో 8వ రోజు విజయ సంకల్పయాత్రలో ఆయన నగరపాలకసంస్థపై విమర్శలు గుప్పించారు. నగరంలో రహదారులు గుంటలమయం, డ్రైనేజీ వ్యవస్థ అపరిశుభ్రంతో నిండిపోయి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోస్తాంధ్ర ఇన్‌చార్జి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, జీ.మధుకర్, నిర్మల కిషోర్, వనమా నరేంద్ర, చందు సాంబశివరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు మద్దతుగా జనసేన నిరసన

గుంటూరు, జనవరి 10: అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడానికి విడుదల చేసిన జీవో నెంబర్ 2ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు న్యాయం చేయాలని కోరుతూ వారికి మద్దతుగా బుధవారం జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్మికుల పోరాటంపై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్మికుల పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు.

పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో

ముందస్తు సంక్రాంతి సంబరాలు

● ఆకట్టుకున్న గ్రామీణ కళాకృతులు, అలంకరణలు



ముందస్తు సంక్రాంతి వేడుకల్లో విద్యార్థుల సంబరాలు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 10 : స్థానిక లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో (సీబీఎస్ఈ) బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆహ్వానితులు ముందుగా పాఠశాలలోని గ్రామదేవతను పూజించి జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల ఆవరణాన్ని పల్లె వాతావరణం తలపించేలా సంక్రాంతి పండుగ కళ్ళకు కట్టినట్లు అద్భుతంగా అలంకరించారు. పాఠశాలలోని పెద్దలు చిన్నారులకు భోగీ పండ్లను పోసి ఆశీర్వదించారు. కొత్త బియ్యంతో పొంగళ్ళు, హరిదాసులు, బుడబుక్కలు, సోదెమ్మ, బుర్రకథ, పిట్టలదొర, పడిన పందెం కోళ్ళు ,కర్రసాము గంగిరెద్దుల విన్యాసాలు, భోగీ మంటలు ఇలా వివిధ రకాల అలంకరణలు, ఆకృతులతో పాఠశాల ప్రాంగణాన్ని నింపేశారు. విద్యార్థులంతా ఎద్దుల బండి ఎక్కడంతో పాటు సంగీత సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులంతా పాల్గొని సంక్రాంతి సంబరాలను దిగ్విజయం చేశారు కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు , సంక్రాంతి ప్రాశస్త్యాన్ని తెలియజేస్తూ.. సంక్రాంతి అంటేనే పెద్ద పండుగ, పెద్దల పండుగ, కొత్త పంట ఇంటికి చేరి అందరూ ఆనందంగా జరుపుకునే పండుగ, మన సంస్కృతి, సాంప్రదాయానికి ప్రతీకగా అన్నివర్గాల ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకునే పండుగ అని వివరించారు. ఈవేడుకల్లో ఉపాధ్యక్షులు సూర్యదేవర హనుమంతరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు గింజుపల్లి వరప్రసాద్‌రావు, నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు, ఆలోకం పెద్దబ్బయ్య, మాదల రాజేంద్రప్రసాద్, సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్ బాబు, మదమంచి రవీంద్ర, జొన్నలగడ్డ రామారావు, వల్లూరి తాండవ కృష్ణ, కొడాలి నాగమల్లేశ్వరరావు, చేకూరి రామకోటేశ్వరరావు, చెరుకూరి నరేంద్రబాబు, ఇతర కమిటీ సభ్యులు డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయనీ బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈసీ మార్గదర్శకాల మేరకు

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ

గుంటూరు, జనవరి10(ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు గతేడాది డిసెంబరు 9వతేది వరకు వచ్చిన క్లెయిమ్స్, అభ్యంతరాలను ఈనెల 12లోపు పరిష్కరించి ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ పూర్తిచేస్తామని కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో ఆయన జేసీ. రాజకుమారి, కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో కే.చంద్రశేఖరరావుతో కలిసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత 25 వారాల నుంచి క్రమం తప్పక ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారు సూచించిన అంశాలను నిబంధనల మేరకు పరిష్కరించటం జరుగుతున్నదన్నారు. ఇప్పటి వరకు 1050 పెండింగ్ క్లయింలు దరఖాస్తులు పరిష్కరించవలసి వుందని జనవరి 12 లోపు వాటిని సహేతుకంగా పరిష్కరించాల్సిందిగా సంబంధిత ఈఆర్‌ఓలకు సూచించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

● రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీ. రామారావు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 10 : రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ ద్వారా ప్రకృతి వ్యవసాయ ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్న 129 హెల్త్‌అండ్‌న్యూట్రీషన్ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కారణంగా గర్భిణులు, పిల్లల ఆరోగ్యంలో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయని రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీ.రామారావు స్పష్టం చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ఫాస్టరల్ ట్రైనింగ్ సెంటర్‌లో రైతు సాధికార సంస్థ ఆరోగ్య విభాగం సిబ్బందికి నిర్వహించిన ఏడు రోజుల శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఫెల్లోస్, అసోసియేట్‌లు, మాస్టర్ ట్రైనర్‌లు, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 10 : 'ఆడుదాం ఆంధ్ర' ద్వారా యువతలో దాగివున్న కీడా నైపుణ్యాలను వెలికితీసి వాటి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రికెట్ పోటీలను కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి స్థానికి బీఆర్ స్టేడియంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. యువత ఆడుదాం ఆంధ్రని సద్వినియోగం చేసుకొనిరానున్న కాలంలో క్రీడల ద్వారా మంచి గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో భాగంగా నగరంలో వార్డ్ సచివాలయాల స్థాయిలో వాలీబాల్, కబాడీ, ఖోఖో, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. గుంటూరు నగరం నుండి రాష్ట్ర స్థాయిలో పతకం సాధించేలా క్రీడాకారులు కృషి చేయాలని కోరారు.

ఉత్సాహంగా మంగళగిరి ప్రీమియర్ లీగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కిరణ్‌చంద్, జయసత్య తదితరులు

మంగళగిరి, జనవరి 10: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగుయువత ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణ పరిధిలోని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణం (బోగి ఎస్టేట్స్)లో జరుగుతు న్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఉద యం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రతిరోజు పది జట్లు తలపడుతు న్నాయి. బుధవారం ఎంఏకే కృష్ణాయపాలెం-ఆల్‌రౌండర్స్ మధ్య జరిగిన మ్యాచ్ లో కృష్ణాయపాలెం జట్టు, రామాలయం రాయల్స్ - కుప్పరావుకాలనీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కుప్పరావుకాలనీ జట్టు, స్పార్టన్స్-ఓల్డ్ బాయ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో స్పార్టన్స్ జట్టు, యూసీ లెవన్-ఆత్మకూరు రైడర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో యూసీ లెవన్, మహానాడు లెవన్-శామ్యూల్ సీసీ మధ్య జరిగిన మ్యాచ్‌లో మహానాడు లెవన్ జట్లు విజయం సాధించాయి. అన్ని మ్యాచ్‌లను సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే సదుపా యం కల్పించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారుడికి తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్ సహకారంతో రూ.2 వేల నగదు, ట్రోఫీ, క్రీడాకారులందరికీ ప్రశంసాపత్రాలను అందజేశారు.

డాన్స్ పోటీలకు కేఎల్‌యూ విద్యార్థిని శృతి



అవార్డుతో కేఎల్‌యూ విద్యార్థిని శృతి

తాడేపల్లి, జనవరి 10: జాతీయ స్థాయి డాన్స్ పోటీలకు కేఎల్‌యూ విద్యార్థిని శృతి సమన్వి కాకర్లపూడి ఎంపికైనట్టు కేఎల్‌యూ డీన్ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో లిబరల్ ఆర్ట్స్ కింద బీబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శృతి సమన్వి కాకర్లపూడి శాక్‌లోని డాన్స్‌క్లబ్‌లో క్రియాశీలక సభ్యురాలని తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన 37వ సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీలో యూత్ ఫెస్టివల్‌లో క్లాసికల్ డాన్స్ విభాగంలో ఆమె జాతీయ స్థాయిలో 2వ స్థానం కైవశం చేసుకుందని తెలిపారు. తద్వారా ఈ ఏడాది ఏపీ తరపున లూథియానాలో జరగనున్న జాతీయస్థాయి మార్చిలో జరిగే పోటీలకు ఆమె ఎంపికయిందని తెలిపారు. శృతిని కేఎల్‌యూ మేనేజ్‌మెంట్ సభ్యులు అభినందించారు.

భౌతికశాస్త్ర విభాగంలో అంతర్జాతీయ సదస్సు

తాడేపల్లి, జనవరి 10: ఇటీవల కాలంలో బల్బుల తయారీలో నూతన ఒరవడి సృష్టించిన ఎల్‌ఈడీ బల్బుల తయారీపై ఇంకా లోతైన అధ్యయనం చేయాల్సి ఉందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ డి.నారాయణరావు అన్నారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరు కాగా ఐఐటీ ఢిల్లీ నుంచి డాక్టర్ విజయ్‌ప్రకాష్, నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ, సీఎస్ఐఆర్ డైరెక్టర్ డాక్టర్ ఆచంట వేణుగోపాల్ గౌరవఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న భౌతిక శాస్త్రవేత్తలు భౌతికరంగంలో ప్రచురించిన పరిశోధనా పత్రాలను కూర్పు చేసి తయారు చేసి ప్రచురించిన పుస్తకాలను ఆవిష్కరించారు. వర్సిటీ నుంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

30వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

● నిరసనలు హోరెత్తుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

మంగళగిరి సిటీ, జనవరి 10: సమస్యల పరిష్కారం కోరుతూ మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం నాటికి 30వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ రాజధాని కమిటీ కార్యదర్శి ఎం భాగ్యరాజు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, అంగన్‌వాడీ యూనియన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి, జనవరి 10: టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు నేతృత్వంలో పార్టీ శ్రేణులు సమ్మెశిబిరం వద్దకు వచ్చి అంగన్‌వాడీలకు మద్దతు ప్రకటించారు. వారి సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తాడికొండ, జనవరి 10: అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కారం కోసం చేస్తున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ పరిష్కరించకుండా ప్రభుత్వ ఎస్మా ప్రయోగించటం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పెదనందిపాడు, జనవరి 10: ప్రభుత్వ చర్యలకు భయపడేది లేదని, సమస్యలు పరిష్కరించేంత వరకు వెనక్కి తగ్గేది లేదని అంగన్‌వాడీలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం పాతబస్టాండ్ కూడలిలో సమ్మె 30వ రోజుకు చేరడంతో 30 అంకె ఆకారంలో నిలబడి మానవహారం చేశారు.

బార్ అసోసియేషన్ సభ్యుల కోర్టు విధుల బహిష్కరణ


శిబిరం వద్ద మాట్లాడుతున్న వేణుగోపాలరావు

తెనాలి క్రైం, జనవరి 10: ప్రభుత్వ పెద్దలు దోపిడీకి అడ్డంగా ఉన్న చట్టాలను క్రమ క్రమంగా తొలగిస్తూ వివిధ శాఖలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని తెనాలి బార్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. బుధవారం కోర్టు ప్రాంగణాల వద్ద చేపట్టిన నిరసన శిబిరం వద్ద తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు 512జీవో ద్వారా తెచ్చిన ల్యాండ్ టైటలింగ్ యాక్టు 27/2023 అత్యంత ప్రమాదకర మైందన్నారు. దీని ద్వారా ప్రభుత్వ పెద్దలు తమ దోపిడీని యథేచ్ఛగా కొనసాగించుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణలేకుండా పోతుందని చెప్పారు. దీన్ని పూర్తిగా ఉపసంహరించుకునే వరకు న్యాయవాదుల నిరసనలు కొనసాగుతాయని తెలిపారు.

కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూ, కోర్టు చట్టాలను బలహీన పరిచే విధంగా జీవోలు తెచ్చి తమ దోపిడీని సులభతరం చేసుకుంటుందని తెలిపారు. సామాన్యుడు తమ కళ్ళ ఎదుట దోపిడీదారులు తమ ఆస్తులను దోచుకున్నా ప్రశ్నించలేని అశక్తత ఏర్పడుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం జీవోను పూర్తి గా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించిన అడిషనల్ డైరెక్టర్


జగనన్న సురక్షా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్ అనీల్‌కుమార్

తెనాలి అర్బన్, జనవరి 10: ఐతానగర్‌లో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అడిషనల్ డైరెక్టర్ అనీల్‌కుమార్ పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫార్మసీ విభాగం, ల్యాబ్, ఈసీజీ కేంద్రాన్ని బుధవారం సందర్శించి ఇప్పటివరకు వైద్య సేవలు అందుకున్న వారి వివరాలను పరిశీలించారు. పట్టణంలో ఎన్ని శిబిరా లు నిర్వహించింది, ఎంతమందిని గుర్తించింది వారికి అందించిన వైద్యసేవలు ఏమిటంటూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మలేరియా, క్షయ వ్యాధి ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను సందర్శించారు. సురక్షా కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు సూచనలు చేశారు. మలేరియా అధికారి ప్రభాకర రెడ్డి, హెల్త్ ఆఫీసర్ హెలెన్ నిర్మల, డాక్టర్ మౌనిక, డాక్టర్ కిషోర్, శ్యామ్, ఉమా కాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ఆందోళన

తెనాలి అర్బన్, జనవరి 10: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఎల్ఐసీ ఉద్యోగులు బుధవారం ఆందోళన చేశారు. స్థానిక కొత్తపేట కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో గంటపాటు నిరసన తెలిపారు. జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఆందోళన కార్యక్రమం చేపట్టామని యూనియన్ తెనాలి శాఖ అధ్యక్షుడు వేదాంతం ఫణీంద్ర చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తుందని వాటిని బలోపేతం చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.


ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు

తెనాలి, మారీసుపేట జనవరి 10: పట్టణంలో పేదల కోసం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగుతున్నా యని టీడీపీ సభ్యులు అన్నారు. స్థానిక శివాజీ చౌక్‌లోని అన్న క్యాంటీన్‌లో బుధవారం గరికపాటి అవినాష్ జన్మది నోత్సవం సందర్భంగా తండ్రి గరికపాటి అమరలింగేశ్వరరావు, వారి కుటుంబ సభ్యుల సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. మార్కెట్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌లో ఎన్నారై విద్యానంస్థల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, క్రొత్తపల్లి రమేష్, సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, ముళ్ళపూడి వెంకట్, వెనిగళ్ళ శివప్రసాద్, అక్కిశెట్టి వెంకటేశ్వరావు గుమ్మడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయంతోనే ఆటవిక పాలనకు ముగింపు

● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్


షరీఫ్‌కు వినతి పత్రం అందచేస్తున్న యూనియన్ నాయకులు

పొన్నూరుటౌన్, జనవరి 10: రాష్ట్రంలో ఆటవిక పాలన అంతమొందాలి అంటే టీడీపీని గెలిపించాలని, ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టీడీపీ విజయం ద్వారానే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పట్టణంలోని ఏపీజే అబ్దుల్ కలామ్ షాదీఖానా లో బుధవారం ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వ హించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్, ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌ల ముందు పలు అసోసియేషన్ల నాయకులు తమ ఆవేదనను వెళ్లబోసుకున్నారు. కార్ స్టాం డింగ్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ పట్టణంలో కార్ల పార్కింగ్ కు సమస్య ఉందని తెలియజేశారు. రోడ్డు మార్జిన్లలో కార్లు నిలుపుదల చేస్తే పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కూరగాయల వ్యాపారుల అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ మార్కెట్‌లో విపరీతంగా అద్దెలు పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. పండ్ల వర్తక సం ఘాల నాయకులు మాట్లాడుతూ రోడ్డు మార్జిన్‌లలో జీవనం సాగిస్తున్న తమను పోలీసులు నిత్యం వేధిస్తున్నారని ఆరోపించారు. అలాగే ఎల్‌క్ట్రీషియన్, టైలర్ అసోసియేషన్, బైక్ మెకానిక్ అసోసియేషన్, బులియన్ మర్చంట్ అసిసోయేషన్, ఆటోస్టాండ్ యూనియన్ తదితర సంఘాల నాయకులు పొన్నూరులో తాము ఎదుర్కొంటున్న సమస్యలకు ఏకరువుపెట్టారు. స్పందించిన ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ గతం లో ఎన్నడూ చూడని విధంగా పొన్నూరులో వైసీపీ పాలన అక్రమ దందాలకు తెరతీసారని ఆరోపించారు. ఎంఎ షరీఫ్ మాట్లాడుతూ అసోసియేషన్ నాయకులు చెప్పిన సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు అసోసియేషన్ల నాయకులు తమ సమస్యల వినతిపత్రాలను షరీఫ్‌కు అందచేశారు. అనంతరం ముఖ్యఅతిథులను ఘనంగా సత్కరించారు.

ఆటోనగర్‌కు శాశ్వత పరిష్కారం చూపిస్తాం: షరీఫ్

పొన్నూరు టౌన్, జనవరి 10: దశాబ్దాలుగా పరిష్కారం కాని పొన్నూరు ఆటోనగర్‌కు శాశ్వత పరిష్కారం చూపిస్తామని శాసన మండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్ తెలిపారు. టీడీపీ ముస్లిం మేనిఫెస్టో రూపకల్పనలో భాగంగా ముస్లిం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు బుధవారం పొన్నూరు పట్టణంలో ఎంఎ షరీఫ్ పర్యటించారు. పట్టణంలోని ఆటో నగర్ అనుబంధ సంస్థల నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆటో నగర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి షరీఫ్ వద్ద ఏకరువు పెట్టారు. ఆటోనగర్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ పొన్నూరు పట్టణంలో 270మంది ఆటోరంగంపై ఆధారపడి మెకానిక్ ఫౌండరీలు, తాయారీరంగ నిపుణులు ఉన్నారన్నారు. ప్రైవేటు స్థలాలో అద్దెలు చెల్లించలేక అద్దెల భారంతో సతమతమవుతున్నట్లు చెప్పారు. వేలాదిమంది జీవనం పొందుతున్న ఆటోనగర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మాట్లాడిన ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆటోనగర్ ఏర్పాటు ఆవశ్యకత గురించి తెలియజేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆటోనగర్ ఏర్పాటుకు చేసినకృషిని వివరించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీలు, ఆటోనగర్ అసోసియేషన్, లారీ ఓనర్స్ అసిసోయేషన్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మా దుర్మార్గం

● శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్


అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్, నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, జనవరి 10: సమస్యల పరిష్కారం కోసం శాంతియుత మార్గంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలపై వైసీపీ ప్రభుత్వం ఎస్మా ప్రయోగించటం దుర్మార్గపు చర్య అని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్ అన్నారు. పొన్నూరు పట్టణంలో నిరసన దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిబిరాన్ని బుధవారం మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా షరీఫ్ అంగన్‌వాడీలకు ధైర్యం చెబుతూ ఎస్మా ప్రయోగం వల్ల భయపడాల్సిన అవసరం లేదని, రాబోయేది తెలుగుదేశం, జనసేన ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో అంగన్‌వాడీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించున్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● కొల్లిపర: న్యాయమైన అంగన్‌వాడీల సమస్యలను ప్రభు త్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ రైతుసంఘ జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. బుధవారం కొల్లిపరలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 30వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన దీక్షలో భాగంగా 30వ అంకెతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు కోటా చంద్రశేఖర్, అంగన్‌వాడీ మండల స్థా యి నాయకులు నిర్మలజ్యోతి, సీతమ్మ, డి.శివపార్వతి, ఆదిలక్ష్మి, సంతోషకుమారి, దీప్తి, శ్రీలక్ష్మి, సువర్ణలత, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.


కొల్లిపర, తెనాలిలో 30వ అంకెతో నిరసన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

● తెనాలి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై ప్రవేశ పెట్టిన ఎస్మాను వెంటనే వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు డిమాండ్ చేశారు. బుధవారం అంగన్‌వాడీల సమ్మె 30వ రోజుకు చేరింది. సమ్మె శిబిరం వద్దే 30 రోజుల చిహ్నంతో అంగన్‌వాడీ వర్కర్లు మానవహారం ఏర్పడ్డారు. విజయవాడ ప్రధాన రహదారిపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన చేశారు. అంగన్‌వాడీలను ఉద్దేశించి బాలరాజు మాట్లాడుతూ, తాత్కాలిక ఉద్యోగులపై ప్రభుత్వం ప్రతాపం చూపడం సరికాదన్నారు. నెల రోజులుగా పసిపిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందడం లేదన్నారు. అంగన్‌వాడీలు కోరుతున్న న్యాయమైన డిమాండ్లలో కొన్నింటినైనా ప్రభుత్వం తీర్చాలన్నారు. నాగలక్ష్మి, జ్యోతి, ఇందిర, సుజాత, పార్వతి, కుమారి, సీఐటీయూ నాయకులు బాబుప్రసాద్, హుస్సేన్‌వలి పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యతిరేక చర్యలతో జగన్ పాలన

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్


పాదయాత్రగా వెళుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, జనవరి 10: రాష్ట్రంలో రాజ్యాంగ వ్యతిరేక చర్యలతో జగన్ పాలన చేస్తున్నారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. తెనాలి నియోజకవర్గంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తలపెట్టిన ప్రజాయాత్ర బుధవారం మూడోరోజు మండలంలోని కఠెవరం నుంచి ప్రారంభమై ఎరుకలపూడి వరకూ చేరింది. దారి పొడవున్నా టీడీపీ, జనసేన పార్టీల అభిమానులు ఆలపాటికి ఘన స్వాగతం పలికారు. ప్రజాయాత్రగా వస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ గ్రామస్థులకు, అభిమానులకు అభివాదం చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను వివరించి భవిష్యత్తుకు భరోసా కల్పించే నాయకుడు చంద్రబాబు పాలనను తిరిగి రాష్ట్రానికి తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. ఆలపాటి పర్యటించిన గ్రామంలోని రైతులను, మహిళలను, చిరువ్యాపారులను పరామర్శించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. నేను విన్నాను.. నేను ఉన్నాను.. నేను చూస్తున్నా.. మన ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేస్తా.. పారిశుధ్య కార్మికులకు న్యాయం చేస్తా.. అన్నదాతలకు వ్యవసాయం పండుగగా చేయిస్తా.. అందరికీ న్యాయం చేస్తా అంటూ ఊదరగొట్టి వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం అతి తొందరలోనే కుప్పకూలిపోయే పరిస్థితి ఉన్నదన్నారు. జగన్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి పొందేలా కాపులకు, బీసీలకు మధ్య గొడవలు పెట్టి రెండు కులాల్ని నాశనం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. పాదయాత్రలో ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా వారిని రోడ్డుపాలు చేసి కుటుంబాలను పస్తులుంటే పరిస్థితికి జగన్ దిగజారారని ఆక్షేపించారు. రాష్ట్రంలో ప్రజలకు పక్కనే ఉన్న ఇసుక దొరకడం కష్టంగా మారిందని, మద్యం మాత్రం ఏరులై పారుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగపరంగా హక్కుగా వచ్చే నిధులు కూడా 70శాతం పక్కదోవ పట్టించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికలు వస్తున్నాయని జగన్ మాయమాటలతో మళ్లీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. టీడీపీ, జనసేనలు ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే ఎక్కడ దోపిడీ భాగోతం బయటపడుతుందోనని అక్రమ కేసులతో నోరు మూ యించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసనకోటేశ్వరరావు, కఠెవరం గ్రామ సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్, పలువురు జనసేన, టీడీపీల నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


మాజీ మంత్రి ఆలపాటికి చెక్కును అందిస్తున్న టీడీపీ నాయకులు నాగేశ్వరావు, రామన్

అన్నక్యాంటీన్‌కు విరాళం

తెనాలి, మారీసుపేట జనవరి 10: మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రజాయాత్ర పేరిట చేపట్టిన పాదయాత్రకు ప్రజలు, గ్రామ నాయకులు బ్రహ్మరథం పడుతున్నారు. మూడోరోజు పాద యాత్రలో టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు అన్నదాసు నాగేశ్వరావు, వారి కుమారుడు అన్నదాసు రామన్‌లు పాల్గొని తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లకు రూ.25,000ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్‌లకు సహకారం అందిస్తున్న దాతలకు ఆలపాటి కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుబ్బయ్య మృతి


సుబ్బయ్య (ఫైల్‌ఫొటో), నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రాజేంద్రప్రసాద్, నక్కాఆనంద్‌బాబు

తెనాలి, మారీసుపేట జనవరి 10: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పట్టణ మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్, తెనాలి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గడవర్తి సుబ్బయ్య (62) బుధవారం మృతిచెందారు. బుధవారం మధ్యాహ్నం వరకు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేస్తున్న పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం ఇంటికి వచ్చి భోజనం చేసి అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను ఆసుపత్రి తరలిస్తుండగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీమంత్రి నక్కా ఆనందబాబు గంగానమ్మపేటలోని సుబ్బయ్య స్వగృహంలో ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బయ్య మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు. ముఖ్యంగా పార్టీకి, ప్రజలకు చేసిన సేవలను మరువలేమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయనకు భార్య శ్రీదేవి, కుమార్తె మాలతి కలరు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, పిల్లి మాణిక్యాలరావు, తాడిబోయిన హరిప్రసాద్, మహమ్మద్ ఖుద్దూస్, కనక రాంబాబు, అత్తోట వందనం, ఈదర శ్రీనివాసరావు, చుక్కపల్లి పెదబాబు, జెట్టి రేణుక, నిమ్మకాయల రమ్య, దమాదేవి, దేవినేని రమాదేవి, వార్డు కౌన్సిలర్ బ్రహ్మేశ్వరావు, వంగా సాంబిరెడ్డి, జొన్నాదుల మహేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్

● మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలి అర్బన్, జనవరి 10: దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో అంబేద్కర్ 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా చేపట్టిన సామాజిక సమత సంకల్పం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రతి వార్డు సచివాలయంలో ఈ నెల 12లోగా ప్రతిరోజూ ఈ కార్యక్రమం చేపట్టాలని కోరారు. అంబేద్కర్ చిత్రపటాలకు నివాళి, ప్రతిజ్ఞ, సంతకాల సేకరణ కార్యక్రమాలు జరపాలన్నారు. విజయవాడ పీడబ్ల్యూసీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 125అడుగుల విగ్రహం గొప్ప విషయమన్నారు. కమిషనర్ జస్వంతరావు, కౌన్సిలర్లు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి రోటరీ క్లబ్‌ల కృషి

పొన్నూరు టౌన్, జనవరి 10: రోటరీ క్లబ్‌లు సమాజాభివృద్ధికి పాటుపడుతున్నాయని ఆ సంస్థ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. భవిత కేంద్రానికి ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ఇతర ఉపకరణాలు అందించారు. కసుకర్రు గ్రామంలోని అమ్మ సేవా నిలయంలో వృద్ధులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ పేదరిక నిర్మూలన విద్య, వైద్యంపై రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేద వర్గాల పేదలకు పాటుపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాసరావు, బోడపాటి రామారావు, అసిస్టెంట్ గవర్నర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి: నజీర్


పారిశుధ్య కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

పొన్నూరుటౌన్, జనవరి 10: పారిశుధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య కార్మికుల నిరాహార దీక్షల శిబిరం బుధవారం 16వ రోజుకు చేరుకుంది. శిబిరానికి మహ్మద్ నజీర్ సైయ్యద్ రఫీ టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు నిమ్మకూరి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

యాచిస్తూ కార్మికుల నిరసన


తెనాలిలో యాచన చేసి నిరసన తెలుపుతున్న కార్మికులు

తెనాలి అర్బన్, జనవరి 10: మున్సిపల్ కార్మికులు బుధవారం యాచనచేసి ప్రభుత్వ వైఖరికి నిరసన తెలిపారు. కనీస వేతనం కోరుతూ మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట శిబిరం ఏర్పాటుచేసి సమ్మె చేస్తున్నారు. మార్కెట్ ప్రాంతంలో తమ దుస్థితిని వివరిస్తూ యాచన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలి మాట్లాడుతూ ప్రభుత్వం మొండి పట్టుదలకు పోకుండా అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను గుర్తించాలన్నారు. సమ్మె చేస్తున్న వారి స్థానంలో తాత్కాలిక కూలీలను పెట్టి వారికి రోజు అధిక మొత్తంలో కూలీ చేస్తున్నారని కానీ అందులో సగమైన తమకు పెంచమంటే పెంచడం లేదని విమర్శించారు. సంఘ నాయకులు మంగళగిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ఏఆర్‌ఆర్ కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు

● శ్రీకళానిలయం కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

కొల్లిపర, జనవరి 10: కొల్లిపర శ్రీఅవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో శ్రీకళానిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కళానిలయం కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీకళానిలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 14వ తేదీన రాత్రి 6.30 గంటలకు విద్యార్థులతో నృత్య ప్రదర్శనలు, 9 గంటలకు స్వప్నం రాల్చిన అమృతం, 15న ఉదయం 10 గంటలకు మండల స్థాయిలో ముగ్గులు పోటీలు, రాత్రి 7గంటలకు పాడాలని ఉంది, 9 గంటలకు విద్యార్థులకు ప్రతిభా పురస్కారం, 9.30 గంటలకు కౌసల్యా సుప్రజారామా నాటిక, 16న రాత్రి 6.30గంటలకు వెన్నెలొచ్చింది హాస్యనాటిక, 7.30గంటలకు నాన్నా నేనొచ్చేస్తా నాటిక, 8.30 గంటలకు జరుగుతున్న కథ నాటిక, 9.30గంటలకు రంగవల్లి విజేతలకు బహుమతులు, 17న రాత్రి 6.30గంటలకు కూచిపూడి నృత్యప్రదర్శన, 8.30గంటలకు ఇంద్రప్రస్థం నాటకం నిర్వహించబోతున్నట్లు తెలియజేశారు. సమావేశంలో శ్రీకళానిలయం కమిటీ సభ్యులు ఆరిమండ శివశంకర్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, ఆరిమండ వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న మంత్రి బొత్స

పెదకాకాని, జనవరి 10: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మాటమంతి కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ రాజశేఖర్ మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను బొత్సకు వీసీ వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్‌లు పాల్గొన్నారు. వైసీపీకి చెందిన విద్యా సంఘాల నాయకులు, సోషల్ మీడియా నిర్వహించిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.

రైల్వే కార్మికుల రిలే నిరాహార దీక్ష

తెనాలి అర్బన్, జనవరి 10: రైల్వే కార్మిక సంఘాల సంయుక్త సమితి పిలుపు మేరకు స్థానిక రైల్వే స్టేషన్ వద్ద కార్మికులు బుధవారం రిలే నిరాహార దీక్ష చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ ప్రవేశ పెట్టాలని కోరుతూ దేశవ్యాప్తంగా దీక్షకు సంఘం పిలుపునిచ్చిందని యూనియన్ అధ్యక్షుడు ప్రభాకర్ బాబు చెప్పారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి పెన్షన్ విధానం సాధించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొడదామన్నారు. పనిభారం తగ్గించి 8గంటల పని విధానం ప్రవేశ పెట్టాలని కోరారు. కార్యదర్శి రవిబాబు, నరేష్, ప్రసన్నకుమార్, రాజశేఖర్, మోహన్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వివాలో వైభవంగా సంక్రాంతి సంబరాలు


భోగి మంటలు ప్రారంభిస్తున్న వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, జనవరి 10: తెలుగుదనం ఉట్టిపడేలా గ్రామీణ నేపథ్యం ప్రతిబింబించేలా వివా ది స్కూల్ నందు సంక్రాంతి సంబరాలను ఘనంగా బుధవారం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం రంగవల్లులు, గొబ్బెమ్మలు, గడ్డివాములు, దాన్యపు బస్తాలతో సంక్రాంతి శోభ సంతరించుకుంది. వివా వీవీఐటీ సంస్థల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అరుణప్రియ దంపతులు భోగి మంటలతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు భోగిఫలాలు సమర్పించారు. సంప్రదాయ వస్త్రధారణతో అలరించిన చిన్నారులు, పల్లెసంబరాల్లో భాగమైన గోపూజ, పొంగళ్ళు, పతంగులు, ఊయలలు, జోడెద్దులబండి, కోడిపందాలతో సందడి చేశారు. రైతుల గాథలు తెలియపరుస్తూ చిన్నారులు ప్రదర్శించిన నాటిక 'కనువిప్పు' ఆకట్టుకుంది. సంక్రాంతి ప్రాముఖ్యత ను తెలియపరుస్తూ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హరిదాసు కీర్తనలు, సోదెమ్మ, బసవన్న, పిట్టలదొర వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల సంప్రదాయ నృత్యాలు, గీతాలాపనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కొమ్మమూరు కాలువలో యువకుడు గల్లంతు

తెనాలి రూరల్, జనవరి 10: గుంటూరుకు చెందిన నలుగురు యువకులు సరదాగా ఈత కొడదామని వచ్చి అందులో ఒకరు నీటి ప్రవాహానికి గలంతైన ఘటన మండలంలోని సంగంజాగర్లమూడి సంగమేశ్వరస్వామి ఆలయ సమీపంలో కొమ్మమూరు కాలువలో జరిగింది. రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరులోని ఏటుకూరు రోడ్డుకు చెందిన కౌలూరు నాని (18) తన తమ్ముడు, మరో ముగ్గురు యువకులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు సంగంజాగర్లమూడి సంగమేశ్వర ఆలయం సమీపంలోని కొమ్మమూరు కాలువ వద్దకు బుధవారం సాయంత్రం వచ్చారు. అందరు కలిసి ఈత కొడుతున్న సమయంలో నాని ఒక్కసారిగా నీటి ప్రవాహంలో మునిగిపోయాడు. దీంతో తోటి వారు పెద్దపెద్ద గా కేకలు వేయగా పరిసర ప్రాంతాల్లోని వారు వచ్చి చూశారు. అప్పటికే కాలువ నీటి ప్రవాహానికి నాని అనవాళ్లు లభించలేదు. దీనిపై అందిన సమాచారంతో ఘటనా స్థలానికి వచ్చి యువకుడిని గాలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

విద్యార్థుల్లో ప్రతిభకు క్రీడలు దోహదం: జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా


కొల్లిపరలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా

కొల్లిపర, జనవరి 10: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని, ఇందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా అన్నారు. బుధవారం ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో భాగంగా కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ పోటీలను ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్ర మంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీవో విజయలక్ష్మి, పరిపాలనాధికారి చంద్రమోహన్, నాయకులు ఆరిగ చంద్రశేఖర్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, బొంతు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.